రేపు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కర్నూలు(కలెక్టరేట్), ఆగస్టు 10: కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో 12వ తేదీ సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టమ్) కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి వినతులు స్వీకరించడం జరుగుతుందని కలెక్టర్ పి.రంజిత్ బాషా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల కేంద్రాలు, మున్సిపల్ కార్యాలయాలు, డివిజన్ స్థాయిలో కూడా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.



ప్రజాధనం వృథా...!

- అసంపూర్తిగా ఆప్షన్-3 ఇళ్లు
- లోపించిన నాణ్యత
- చేతులెత్తేసిన కాంట్రాక్టర్లు
- భూ సేకరణలో వైసీపీ నాయకులు, అధికారుల చేతివాటం
- సీఐడీ విచారణ చేస్తే వెలుగులోకి భారీ కుంభకోణం

కర్నూలు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి):

సొంతిల్లు పేదల చిరకాల స్వప్నం. గత వైసీపీ ప్రభుత్వం సెంటు స్థలంలో ఇల్లు కట్టిస్తామంటే గుడిసె కంటే నయమని సర్దుకున్నారు. భద్రతా ప్రమాణాలు నిబంధనలు పాటించకుండా ఇళ్లు నిర్మాణాలు చేపట్టారు. పేదల ఇళ్లే కాదా..? ప్రశ్నించేవారు ఎవరనుకున్నారో..? అధికారం ఉంది కాదా ఎలాకట్టినా అడిగేవారెవరు..? అన్న ధీమానో.. మరే ఇతర కారణమే కాంట్రాక్టర్లకే తెలియాలి. గత వైసీపీ ప్రభుత్వంలో జగనన్న కాలనీల్లో ఆప్సన్-3 కింద చేపట్టిన ఇళ్ల నిర్మాణంలో నాణ్యతాప్రమాణాలు తుంగలో కలిపేస్తున్నారు. ఇంజనీర్ల సూచనలు పెడచెవిన పెట్టేసి ఇష్టారాజ్యంగా 'పేక మేడల్లా' పేదల ఇళ్లు నిర్మాణాలు చేపట్టారు. టీడీపీ ప్రభుత్వం రాగనే చేతులెత్తేశారు.. అసంపూర్తిగా వదిలేశారు. అంతేకాదు.. ఆదోని, మంత్రాలయం పట్టణాల్లో భూ సేకరణలో భారీ అక్రమాలు జరిగాయనే ఆరోపణలు లేకపోలేదు. సీఐడీ అధికారులతో సమగ్ర విచారణ చేస్తే భారీ అవినీతి కుంభకోణం వెలుగు చూడటం ఖాయమని స్థానికులు పేర్కొంటున్నారు.

జిల్లాలో గత వైసీపీ ప్రభుత్వం జగనన్న కాలనీల పేరిట ఆర్భాటం చేసి పేదల ఇళ్ల నిర్మాణంలో మాత్రం అంతులేని నిర్లక్ష్యాన్ని ప్రదర్శించింది. అంతేకాదు సెంటు స్థలంలో ప్రభుత్వమే ఇల్లు కట్టిస్తుందని అప్పటి సీఎం జగన్ సహా మంత్రులు, ఎమ్మెల్యేలు పదేపదే చెబుతూ వచ్చారు. అదంతా ఆర్భాటమే అని తేలిపోయింది. కర్నూలు, కోడుమూరు, ఎమ్మిగనూరు, ఆదోని, ఆలూరు, పత్తికొండ, మంత్రాలయం, పాణ్యం నియోజకవర్గాల్లో 'నవరత్నాలు-పేదలు అందరికీ ఇళ్లు' పథకంలో భాగంగా 291 లేఅవుట్లలో 37,550 ఇళ్లు మంజూరు చేశారు. 2021 జూన్ 1న మెగా గ్రౌండింగ్ మేళా అంటూ ఎంతో అర్భాటం చేశారు. 2024 జూన్ 12న వైసీపీ ప్రభుత్వం గద్దెదిగి టీడీపీ ప్రభుత్వం కొలువుదీరింది. గత జగన్ ప్రభుత్వం ఐదేళ్లలో పేదలకు నిర్మించి ఇచ్చిన ఇళ్లు 17,071 మాత్రమే. అంటే మొదలు పెట్టిన ఇళ్లలో 45 శాతం పురోగతి లేదు. ఆప్షన్-3 కింద పేదలకు కట్టించే ఇళ్ల నిర్మాణాలు ఇళ్లు పేకమేడలు, ఇసుక గూళ్ల కంటే దారుణంగా ఉన్నాయి. ధనాపేక్షతో కాంట్రాక్టర్లు నిబంధనలు, నాణ్యత ప్రమాణాలను తుంగలో తొక్కారు. రూ.కోట్ల ప్రజాధనం ఖర్చు చేసినా ఒక్క ఇంటిని కూడా పూర్తి చేసి పేదలకు అప్పగించలేదు. వైసీపీ పాలకుల నిర్లక్ష్యం పేదలకు శాపంగా కాగా ఆ భారం ప్రస్తుత కూటమి ప్రభుత్వంపై పడింది.





ఇవేమి ఇళ్లు..!


ఇంటిని నిర్మించుకునే ఆర్థిక స్థోమత లేని పేదలకు ప్రభుత్వమే ఇల్లు కటించి ఇస్తుందని గత జగన్ ప్రభుత్వం ఆర్భాటం చేసింది. అందులో భాగంగా జిల్లాలో ఆప్సన్-3 కింద 10,595 ఇళ్లు మ్యాపింగ్ చేస్తే.. 9,607 ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. అందులో ఆదోని పట్టణ పేదల కోసం డణాపురం సమీపంలో 144 ఎకరాల్లో లే-అవుట్ వేసి 5,101 ఇళ్ల చేపడితే అప్పటి ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి అండతో, ఎమ్మిగనూరు పట్టణంలో శివన్న నగర్ టిడ్కో ఇళ్లను ఆనుకుని 1,147 ఇళ్లు, మంత్రాలయంలో 12 ఎకరాల్లో 176 ఇళ్లు చేపడితే అప్పటి ఎమ్మెల్యేల అండతో నెల్లూరు జిల్లాకు చెందిన జేఎన్ఆర్ కన్‌స్ట్రక్షన్ సంస్థ అధినేత జనార్ధన్‌రెడ్డి నిర్మాణాలు చేపట్టారు. బిల్లులు, సిమెంట్, స్టీల్ కలుపుకొని ఆదోనిలో రూ.36.33 కోట్లు, ఎమ్మిగనూరులో రూ.15.58 కోట్లు కాంట్రాక్టరుకు ప్రభుత్వం చెల్లించింది. రూ.కోట్లు ప్రజాధనం ఖర్చు చేసినా మూడో ఆప్షన్ కింద చేపట్టిన పేదల ఇళ్లు ఒక్కటి కూడా పూర్తి చేయలేదు. పైగా నాణ్యతాప్రమాణాలు తుంగలో కలిపేశారు. నల్లరేగడి నేలల్లో కట్టారు. వర్షాకాలంలో తేమకు గట్టిగా.. వేసవి ఎండలకు లూజుగా మారే సహజ గుణం ఈ నేలకు ఉంటుంది. ఇలాంటి భూమిలో పునాది ఎంతో కీలకం. సాయిల్ టెస్ట్ (భూమి పరీక్ష) చేయించి 'సేఫ్ బేరింగ్ కెపాసిటీ' మేరకు పునాదులు లేదా పిల్లర్ గుంతలు తవ్వాలి. ఎస్‌పీసీ నిబంధన ప్రకారం పిల్లరు వేసేందుకు గట్టినేల వచ్చే వరకు 10-12 అడుగులు పునాది తవ్వి.. అడుగు భాగాన 'బల్బ్' వేసి ఆపైన ఆర్‌సీసీ కాంక్రీట్ పిల్లర్‌ను నిర్మించాలి. భూమి నుంచి బేస్ మట్టం వరకు రాతితో గోడ కట్టి.. ప్లింత్‌బీమ్ వేసి దానిపైన ఇంజనీర్లు సూచించిన ఇటుకలతో గోడ నిర్మించాలని ఇంజనీర్లు పేర్కొంటున్నారు. ఎక్కడా కూడా ఈ నిబంధన పాటించలేదు.

భూ సేకరణలో అవినీతి భాగోతం

ఆదోని పట్టణానికి సుమారు 5 కిలోమీటర్ల దూరంలో డణాపురం గ్రామం వద్ద 144.25 ఎకరాలు రైతుల నుంచి సేకరించారు. గృహ నిర్మాణాలకు అనువుగా లేదని అప్పట్లో ఇంజనీర్లు చెప్పినా నాటి ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి ప్రోద్బలంతో రెవెన్యూ అధికారులు పేదల ఇళ్ల కోసం భూ సేకరణ చేశారు. ఎకరాకు రూ.13.50 లక్షల వరకు రైతులకు చెల్లించారు. భూ సేకరణలో భారీగా అవినీతి అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. వైసీపీ ముఖ్య నాయకుడి అండతో ఆ పార్టీకి చెందిన భూ దళారులు, ఆ సమయంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టరుగా పని చేసిన అధికారి ఇష్టారాజ్యంగా వ్యవహరించాడు. 10 శాతం చొప్పున ఎకరాకు రూ.3 లక్షలకు పైగా రైతుల నుంచి అక్రమంగా వసులు చేసి రూ.3 కోట్లకు పైగా వాటాలుగా పంచుకున్నారని సమాచారం. ఇదే క్రమంలో ఓ ముఖ్య నాయకుడికి కూడా పెద్ద ఎత్తున ముట్టజెప్పారనే ఆరోపణలు ఉన్నాయి. మంత్రాలయంలో రెండు చోట్ల 12 ఎకరాలు సేకరించారు. ఇక్కడ ఎకరాకు రూ.25 లక్షలు భూ పరిహారం ప్రభుత్వం చెల్లించింది. ఇక్కడ కూడా గత ప్రభుత్వంలో అధికారం మాటున వైసీపీ నాయకులు పెట్రేగిపోయి రైతుల నుంచి ఎకరాకు రూ.2-3 లక్షలకు పైగా వసులు చేశారన్నా ఆరోపణలు ఉన్నాయి. వీటిపై సీఐడీ విచారణ చేస్తే ఇళ్ల నిర్మాణం సహా భూ సేకరణ పేరిట సాగించిన అవినీతి కుంభకోణం వెలుగు చూసే అవకాశం ఉందని స్థానికులు అంటున్నారు. అధికారులు స్పందించి ఆ దిశగా చర్యలు తీసుకోవాలని, అసంపూర్తిగా వదిలేసిన ఇళ్లు పూర్తి పేదలకు అప్పగించాలని పేదలు కోరుతున్నారు.



'నామినేట్' అయ్యేదెవరో..?



- నామినేటెడ్ పదవుల భర్తీపై ప్రభుత్వం దృష్టి
- పోటీ పడుతున్న పలువురు నాయకులు
- ఆశావహుల ముమ్మర ప్రయత్నాలు
- అధిష్టానం గుర్తిస్తుందో లేదోనని ఆందోళన
- తుగ్గలి నాగేంద్రకు మెండుగా అవకాశాలు

పత్తికొండ, ఆగస్టు 10: పార్టీ కోసం కష్టపడిన నాయకులకు నామినేటెడ్ పదవులు కట్టబెట్టేందుకు అధిష్టానం సిద్ధమైంది. అందుకోసం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గ కేంద్రాల ఇన్‌చార్జిల నుంచి రాష్ట్ర పార్టీ కార్యాలయం వివరాలను సేకరించినట్లు సమాచారం. మరో వైపు పార్టీ కోసం తాము చేసిన సేవలకు గుర్తింపుగా నామినేటెడ్ పదవులు కేటాయించాలని, ఇప్పటికే ఆయా నియోజకవర్గ కేంద్రాల నుంచి నాయకులు అధిష్టానాన్ని కలిసి తమ మనస్సులో కోరికను చెప్పుకోవడంతోపాటు పదవి పొందేందుకు అవసరమైన దారులు వెతికే పనిలో ఉన్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో నామినేటెడ్ పదవుల భర్తీకి పార్టీ అధినేత గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారని, త్వరలోనే ప్రక్రియ ప్రారంభం కాబోతుందన్న ప్రచారం సాగడంతో ఆశావహుల్లో ఆందోళన మొదలైంది. పార్టీ తమను గుర్తిస్తుందో లేదోనని లోలోన మదపడుతున్నారు. కర్నూలు జిల్లాలోనే అత్యధికంగా సీనియర్ నాయకులు పత్తికొండ నియోజకవర్గం నుంచి నామినేటెడ్ పదవులు ఆశిస్తున్నట్లు సమాచారం.

కార్పొరేషన్ చైర్మన్ ఆశిస్తున్న తుగ్గలి నాగేంద్ర



తుగ్గలికి చెందిన తుగ్గలి నాగేంద్ర ప్రస్తుతం టీడీపీ రాష్ట్ర నిర్వాహక కార్యదర్శిగా ఉన్నారు. పలు సామాజిక కార్యక్రమాలతోపాటు పార్టీ అభివృద్ధి కోసం మొదటి నుంచి పని చేస్తున్న ఆయన 2009లో కేఈ ప్రభాకర్ గెలుపు కోసం, 2014లో కేఈ క్రిష్ణమూర్తి గెలుపు కోసం, 2024లో కేఈ శ్యాంబాబు గెలుపు కోసం పని చేశారు. దీనికితోడు అధినేత చంద్రబాబునాయుడు కుటుంబంతో నేరుగా పరిచయాలు ఉన్నాయి. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో శాలివాహన కార్పొరేషన్ చైర్మన్‌గా నామినేటెడ్ పదవి పొందారు. ఈసారి కూడా కార్పొరేషన్ చైర్మన్ స్థాయి పదవిని ఆయన ఆశిస్తున్నారు. అందుకు సంబంధించి స్థానిక ఎమ్మెల్యేతోపాటు పార్టీ అధిష్టానాన్ని కలిసి తన మనసులో మాటను చెప్పుకున్నారు. ఎన్నికలకు ముందు అధినేత ఇచ్చిన మాట ప్రకారం తాను ఆశించిన నామినేటెడ్ పదవి వస్తుందన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేస్తున్నారు.

చంద్రబాబు హామీతో పార్టీలోకి..

రాజకీయాల్లో ఎప్పుడూ చురుకుగా ఉండే తుగ్గలి నాగేంద్ర 2019 నుంచి సైలెంట్ అయిపోయాడు. ఇది గమనించిన టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు అనంతపురం జిల్లా మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి ద్వారా పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనేలా చేశారు. ఆ సమయంలోనే నాగేంద్రకు సముచిత స్థానం కల్పిస్తానని చంద్రబాబు మాట ఇచ్చారని తెలుస్తోంది. మరోవైపు సామాజికపరంగా సమతుల్యత పాటించినా ఆయనకు నామినేటెడ్ పదవి తప్పనిసరి అన్న చర్చ సాగుతోంది. దీనికితోడు ఆయన విరివిగా సాగించే సేవా కార్యక్రమాలతోపాటు చంద్రబాబుతో నేరుగా సత్సంబంధాలు కలిగి ఉండటం ఆయనకు కలిసొచ్చే అంశాలుగా చెప్పవచ్చు. ఈ క్రమంలోనే తుగ్గలి నాగేంద్రకు నామినేటెడ్ పదవి ఖాయమన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఎస్టీ కోటాలో వెంకటపతి...



పత్తికొండ నియోజకవర్గ పరిధిలోని మారుమూల గ్రామమైన ఎంకే కొట్టాల సర్పంచ్‌గా రాజకీయ ప్రస్థానం చేపట్టిన వెంకటపతి ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన నాయకుడు. టీడీపీలో రాజకీయ జీవితం ప్రారంభించి పార్టీ అభివృద్ధికి కృషి చేస్తున్నారు. టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షునిగా పని చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించి ఎస్టీ వర్గాలను టీడీపీలోకి తెచ్చేందుకు పని చేశారు. గత ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం పని చేసి పార్టీ గెలుపులో పాలుపంచుకున్నారు. ఈసారి నామినేటెడ్ పదవుల్లో ఎస్టీ కార్పొరేషన్ చైర్మన్‌గా తనకు అవకాశం కల్పిస్తే రాష్ట్రవ్యాప్తంగా ఎస్టీల అబివృద్ధికి పాటుపడతానని చెబుతున్నారు. టీడీపీని క్షేత్ర స్థాయిలో బలోపేతం చేసేందుకు తనకు పార్టీ అవకాశం కల్పిస్తుందని ఆశాభావం ఆయన వ్యక్తం చేస్తున్నారు.

కార్పొరేషన్ డైరెక్టర్ పదవిపై మనోహర్‌చౌదరి ఆశలు



పత్తికొండ నియోజకవర్గంలో సీనియర్ నాయకుల్లో మనోహర్‌చౌదరి ఒకరు. ప్రస్తుతం తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షునిగా ఆయన పార్టీకి సేవలు అందిస్తున్నారు. పార్టీ ఆవిర్భావం నుంచి నియోజకవర్గంలో పార్టీ అభివృద్ధి కోసం పని చేస్తూ వచ్చిన ఆయన ఇప్పటి వరకు పార్టీ నుంచి ఎలాంటి పదవి ఆశించకుండా వచ్చారు. ఈసారి నామినేటెడ్ పదవుల్లో ఫుడ్ కార్పొరేషన్ లేక, మైనింగ్ కార్పొరేషన్‌లలో డైరెక్టర్ పదవిని ఆయన ఆశిస్తున్నారు. అందుకు సంబంధించి స్థానిక ఎమ్మెల్యే సహకారంతోపాటు పార్టీ ముఖ్య నేతలను కలిసి తన అర్జీని ఇచ్చారు. తప్పక తనకు పార్టీ నుంచి పదవి వస్తుందన్న ఆశాభావం ఆయన వ్యక్తం చేస్తున్నారు.

ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ వైపు బత్తిన చూపు



బత్తిన వెంకట్రాముడు ప్రస్తుతం టీడీపీ రాష్ట్ర కార్యదర్శిగా పని చేస్తున్నారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయికి ఎదిగి జిల్లా పరిషత్ చైర్మన్‌గా ఆయన పని చేశారు. ఆ తర్వాత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పని చేశారు. గత ఎన్నికల్లో గుంతకల్, రాప్తాడు, తాడిపత్రి, ఉరవకొండ నియోజకవర్గాల అబ్జర్వర్‌గా పని చేశారు. ప్రసుత్తం ఫుడ్ కాక్పొరేషన్ చైర్మన్‌లేక ఆ స్థాయి పదవిని ఆశిస్తూ అధిష్టానానికి నివేదిక పెట్టుకున్నాడు. పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీ కోసం పని చేస్తున్న తనను పార్టీ గుర్తించి పదవిని అందిస్తుందన్న ఆశాభావంతో ఉన్నారు.

కేడీసీసీ చైర్మన్ పదవి వైపు సాంబశివారెడ్డి చూపు



కేఈ కుటుంబానికి ఆప్తుడిగా, ఆ కుటుంబం నుంచి ముగ్గురు ఎమ్మెల్యేలు పత్తికొండ ని యోజకవర్గంలో గెలుపునకు సూత్రధారిగా పేరుగాంచిన సీనియర్ నాయకుడు కె.సాంబ శివారెడ్డి, కాంగ్రెస్ పార్టీలో ఎమ్మెల్యేగా పోటీ చేసిన ఆయన 2009 ఎన్నికల్లో తన ప్రత్యర్థి వర్గం ఎస్వీ కుటుంబం పార్టీలోకి రావడంతో టీడీపీ తరఫున బరిలో నిలిచిన కేఈ ప్రభాకర్ గెలుపు నకు అండగా నిలిచారు. ఆ తర్వాత కేఈ క్రిష్ణ మూర్తి గెలుపు కోసం అలుపెరగని కృషి చేశారు. గత ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే తన కుటుంబ సభ్యులపై తప్పుడు కేసులు నమోదు చేసి నా వారి అరాచకాలకు ఎదురు నిలిచారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో స్థానికంగా పార్టీ నాయకులకు అండగా నిలిచి వారికి ధైర్యం ఇస్తూ 2024 ఎన్నికల్లో కేఈ శ్యాంబాబు గెలుపు కోసం పని చేశారు. ఎలాంటి పదవులు ఆశించ కుండా పార్టీ అభివృద్ధికి పని చేస్తూ వచ్చిన ఆయన ఈ సారి కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ పదవిని ఆశిస్తున్నారు. పార్టీ అధిష్టానానికి అందుకు సంసిద్ధత వ్యక్తం చేసినట్లు సమాచారం.

ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు : ఎస్పీ



కర్నూలు, ఆగస్టు 10: నగరంలో వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ జి.బిందు మాధవ్ తెలిపారు. శనివారం స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు తీసుకోవాల్సిన చర్యలపై ఆయా పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలతో కలిసి సమావేశం నిర్వహించారు. పాఠశాలలు, కళాశాలలు పని వేళలలో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా యాజమాన్యాలే వారి సెక్యూరిటీ చేత సెల్ఫ్ ట్రాఫిక్ కంట్రోల్ చేయించాలన్నారు. బైక్ రైడింగ్, బైక్ సైలెన్సర్లు తీసి ఎక్కువ శబ్దం చేస్తూ వాహనాలు నడిపే వవారి వివరాలను 77778 77722 నెంబరుకు ఫోన్ లేదా వాట్సప్ ద్వారా సమాచారం ఇవ్వాలన్నారు. ర్యాగింగ్, ఈవ్ టీజింగ్ చేసేవారిని ఉపేక్షించే ప్రసక్తే లేదన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ జే.బాబు ప్రసాద్, టూటౌన్ సీఐ నాగరాజరావు తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి

వాక్ ఇన్ ఇంటర్వ్యూ

ఆంధ్రజ్యోతి దినపత్రిక
కర్నూలు జిల్లా డెస్క్‌లో పనిచేయడానికి
అనుభవం కలిగిన జర్నలిస్టులు కావాలి

- డిగ్రీ పాసై ఉండాలి. వయస్సు 50 సంవత్సరాల లోపు ఉండాలి.
- తెలుగు భాషపై, వర్తమాన వ్యవహారాలపై మంచి పట్టు ఉండాలి.
- ఇంగ్లీషు అర్థం చేసుకోగలిగి ఉండాలి.
- ఏదైనా ప్రముఖ పత్రిక జిల్లా డెస్క్‌లో కనీసం ఏడేళ్లు పనిచేసిన అనుభవం ఉండాలి.
- క్వార్క్ ఎక్స్‌ప్రెస్‌లో పేజీ లేఅవుట్ చేయగలిగి ఉండడం అదనపు అర్హత.
- అనుభవం, అర్హతల ప్రాతిపదికన వేతనం ఉంటుంది.

మీ ఫొటో, పూర్తి బయోడేటా, గతానుభవం తాలూకు వివరాలతో హాజరు కండి

వాక్ ఇన్ ఇంటర్వ్యూ తేదీ	సమయం:
11-08-2024	ఉదయం 10:00 గంటలకు

వివరాలకు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్
99854 11362

చిరునామా:
ఆంధ్రజ్యోతి కార్యాలయం:
గుత్తిరోడ్, నియర్ ఇండస్ స్కూల్, పందిపాడు గ్రామం, కర్నూలు.



వధువరుల సమక్షంలో రక్తదానం చేస్తున్న స్నేహితులు

పెళ్లిపందిట్లో రక్తదానం!

ఆళ్లగడ్డ, ఆగస్టు 10: ఆళ్లగడ్డ పట్టణంలో నందింపల్లె గ్రామానికి చెందిన తలారి మహేంద్ర తన వివాహం సందర్భంగా రక్తదాన శిబిరం శనివారం నిర్వహించి ఆదర్శంగా నిలిచారు. రక్తదానంపై ప్రజల్ని చైతన్యవంతులు చేసేందుకు ఈ కార్యక్రమం తలపెట్టినట్లు వరుడు చెప్పారు. పెళ్లికి వచ్చిన పలువురు బంధుమిత్రులతో రక్తదానం చేయించారు. సేకరించిన రక్తాన్ని నంద్యాల బ్లడ్ బ్యాంక్ నిర్వాహకులకు అందజేశారు. ఈ సందర్భంగా వధువరులు సాయిలక్ష్మిదేవి, మహేంద్రలను పలువురు అభినందించారు.

చింతలచెరువులో నీట మునిగిన పంటలు



కోతకు గురైన టీజీపీ పంట కాలువ

చాగలమర్రి, ఆగస్టు 10: చాగలమర్రి మండలం చింతలచెరువు గ్రామ సమీపంలోని టీజీపీ బ్లాక్ చానల్ శనివారం కోతకు గురైంది. పంట కాలువలో ప్రవహించే నీరు రైతులు సాగు చేసిన వంద ఎకరాల్లో వరి, మొక్కజొన్న, ఉల్లి పంటలు నీట మునిగాయి. 36వ బ్లాక్ చానల్ పరిధిలో పంట కాలువ పొంగి ప్రవహించడంతో కాలువ వెంటగల పొలాలు నీట మునిగి రైతులకు నష్టం వాటిల్లింది. ఇప్పుడిప్పుడే వేసిన వరి నాట్లు, ఉల్లి పంట దెబ్బతిందని రైతులు ఆవేదన చెందుతున్నారు. టీజీపీ ప్రధాన కాలువ నుంచి 36వ బ్లాక్‌చానల్‌కు గేట్లను ఎత్తి నీరు విడుదల చేయడంతో కాలువ వెంట నీరు అధికంగా రావడంతో పొంగి ప్రవహించింది. చాగలమర్రి గ్రామ సమీపంలోని చివరి ఆయకట్టు పరిధిలోగల మొక్కజొన్న పంట నీట మునిగింది. రత్నామాచారి, ప్రసాదురెడ్డి, హరినాథ్‌రెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, చిన్నపురెడ్డి, మరి కొందరు రైతులు వేసిన వరి నాట్లు, ఉల్లి పంట నీట మునిగి నష్టం వాటిల్లిందని వాపోయారు. పంట కాలువలు సరిగా లేకపోవడం వల్ల పంట పొలాల్లో ప్రవహించడంతో నష్టపోతున్నామని అన్నారు. ఇప్పుడిప్పుడే సాగు చేసిన పంటలు నీట మునగడంతో పంట దిగుబడి రాదని రైతులు విలపిస్తున్నారు. నీట మునిగిన పంట పొలాలకు పరిహారం అందించి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ విషయం గురించి టీజీపీ ఏఈ సలీమ్‌ను వివరణ కోరగా టీజీపీ ప్రధాన కాలువ నుంచి 36వ బ్లాక్‌చానల్‌కు గేట్లను ఎత్తి అడుగు నీరు విడుదల చేశామని అన్నారు. కాలువకు నీరు అధికమై పొంగి ప్రవహించిందని అన్నారు. కొన్ని చోట్ల రైతులే నీటి కోసం కట్టలు వేసుకోవడం వల్ల నీటి ఉధృతి పెరిగి పంట పొలాల్లో ప్రవహించిందని అన్నారు. పంట కాలువకు నీరు తగ్గించామని అన్నారు. టీజీపీ ప్రధాన కాలువ వద్దగల డిస్ట్రిబ్యూటరీ సెట్టర్‌ను తగ్గించి అడుగు నీరు మాత్రమే విడుదల చేశామని తెలిపారు.

రాఘవేంద్రుని సన్నిధిలో నాగసాధువులు

మంత్రాలయం, ఆగస్టు 10: మంత్రాలయం రాఘవేంద్ర స్వామి దర్శనార్థం ఐదుగురు నాగసాధువులు శనివారం రాఘవేంద్ర స్వామిని దర్శించుకున్నారు. మహా ముఖ ద్వారం వద్ద మఠం మేనేజర్లు ఎస్‌కే శ్రీనివాసరావు, శ్రీపతి ఆచార్‌లు ఘనంగా స్వాగతం పలికారు. గ్రామ దేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి విశేష పూజలు చేశారు. అనంతరం మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు మెమెంటో, శేషవస్త్రం, ఫల, పుష్ప, మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు. దేశంలోని వివిధ పుణ్య క్షేత్రాలు సందర్శనలో భాగంగా మంత్రాలయం వచ్చినట్లు నాగసాధువులు తెలిపారు. వీరి వెంట బిందు మాధవ్, అనంతస్వామి, ప్రకాశ్ ఆచార్, భీమ్‌సేన్ ఆచార్, పవన్‌ఆచార్, వ్యాసరాజ ఆచార్, జయతీర్థ ఆచార్, రంగస్వామి ఉన్నారు.

రూ.15 కోట్ల పంట రుణాలు విడుదల

కర్నూలు(అగ్రికల్చర్), ఆగస్టు 10: ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఖరీఫ్ ప్రారంభమై రెండు నెలలు కావస్తోంది. ఒక్క సహకార సంఘాలకు తప్ప మిగిలిన వాణిజ్య బ్యాంకుల్లో రుణాల పంపిణీ ఇప్పటికే మొదలైంది. కర్నూలు, నంద్యాల జిల్లాలో 99 సహకార సంఘాలు ఉన్నాయి. ఈ సంఘాల ద్వారానే ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో దాదాపు నాలుగున్నర లక్షల మంది రైతులకు రుణాలు అందుతున్నాయి. ఈసారి వివిధ కారణాల వల్ల సహకార సంఘాల్లో రుణాల పంపిణీ ఇప్పటి దాకా మొదలు కాకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ప్రజాప్రతినిధులు రైతుల నుంచి ఒత్తిళ్లు ఎక్కువ కావడంతో ఎట్టకేలకు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ద్వారా రూ.15 కోట్లను ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలకు విడుదల చేశారు. ఆయా సంఘాల పరిధిలో కౌలు రైతులకు రూ.10 లక్షలు, సొంత పొలం ఉన్న రైతులకు రూ.15 లక్షలు మొత్తం ఒక్కో సంఘానికి రూ.25 లక్షల చొప్పున రూ.15 కోట్లు విడుదల చేసినట్లు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు సీఈవో విజయకుమార్ తెలిపారు. త్వరలోనే అర్హత ఉన్న రైతులందరికీ జిల్లా ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల ద్వారా రుణాలు అందిస్తామని చెప్పారు.

నేటి నుంచి టమోటా కొనుగోళ్లు



పత్తికొండ, ఆగస్టు 10: పత్తికొండ వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో ఆది వారం నుంచి టమోటా కొనుగోళ్లు ప్రారంభిస్తున్నట్లు కార్యదర్శి కార్నలిస్ తెలిపారు. ఆదివారం ఉయయం 8గంటలకు ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు పూజా కార్యక్రమాలు నిర్వహించి టమోటా కొనుగోళ్లను ప్రారంభిస్తారన్నారు. రైతులు సాగు చేసిన టమోటా పంటను విక్రయాలకు మార్కెట్‌కు తీసుకు రావాలన్నారు.

ఫ్యాక్షన్‌కు మళ్లీ ఆజ్యం పోస్తున్న జగన్

టీడీపీ జిల్లా అధ్యక్షుడు పి.తిక్కారెడ్డి


కర్నూలు(కల్చరల్), ఆగస్టు 10: రాయలసీమలో తిరిగి ఫ్యాక్షన్ గొడవలకు సైకో జగన్ రెడ్డి ఆజ్యం పోస్తున్నాడని టీడీపీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు పి.తిక్కారెడ్డి అన్నారు. శనివారం నగరంలోని టీడీపీ కార్యాలయంలో ఆయన ఎమ్మెల్సీ బీటీ నాయుడుతో కలిసి విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో గడచిన 20 ఏళ్ల నుంచి అంతరించిపోయిన ఫ్యాక్షన్ రాజకీయాలను మాజీ ముఖ్యమంత్రి జగన్ తిరిగి ఆజ్యంపోసి ఉసిగొలుపుతున్నారని ఆరోపించారు. మహానంది మండలం సీతారామపురం గ్రామంలో జరిగిన హత్యపై జగన్ చేసిన వ్యాఖ్యలు సిగ్గుచేటుగా ఉన్నాయన్నారు. జరిగిన హత్యను టీడీపీపై ఆపాదించడం, టీడీపీ నేతలపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేయడం సరైంది కాదన్నారు. జగన్ ఐదేళ్ల పాలనలో లెక్కలేనన్ని హత్యలు జరిగాయని, అందుకు జగనే బాధ్యుడన్నారు. సొంత బాబాయ్‌ని హత్యపై స్పందించని జగన్.. సొంత చెల్లి, తల్లి రోడ్డున పడితే వారికి సమాధానం ఇవ్వలేని వ్యక్తి ఇప్పుడు చంద్రబాబుపై కేసులు పెట్టాలని కోరడం సిగ్గుచేటన్నారు. వ్యక్తిగత కక్షలతో హత్య జరిగితే దాన్ని టీడీపీకి అంటగట్టి లబ్ధిపొందాలని చూస్తున్న జగన్‌కు 151 సీట్ల నుంచీ 11 సీటకు ఓడించినా ఇంకా సిగ్గురాలేదని ఆరోపించారు. అధికారంలో ఉన్న రోజుల్లో జిల్లాలోని నీటి పారుదల ప్రాజెక్టులు, పరిశ్రమలపై శ్రద్ధ చూపని జగన్ హత్యలపై మాత్రం ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నాడని ఎద్దేవా చేశారు. జగన్ రెడ్డికి బెయిల్ రద్దయి తిరిగి జైలుకు వెళ్లడం తప్పదన్నారు. ఆయన ఇప్పటికైనా చీప్ పాలిటిక్స్ మానుకోవాలని హితవుపలికారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకెపోగు ప్రభాకర్, రాష్ట్ర కార్యదర్శి వై.నాగేశ్వరరావు యాదవ్, కేవీ సుబ్బారెడ్డి, నాయకులు డి.జేమ్స్, ఎస్.ముంతాజ్, పి.హనుమంతరావు చౌదరి, సత్రం రామకృష్ణుడు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పి.తిక్కారెడ్డి, టీడీపీ నాయకులు

రాఘవేంద్ర స్వామి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

మఠం మేనేజర్ ఎస్‌కే శ్రీనివాసరావు



మంత్రాలయం, ఆగస్టు 10: మంత్రాలయం రాఘవేంద్రస్వామి 353వ ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మఠం మేనేజర్ ఎస్‌కే శ్రీనివాసరావు తెలిపారు. ఈనెల 18 నుంచి 24వరకు జరిగే సప్తరాత్రోత్సవాల్లో పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆదేశాల మేరకు భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ముందస్తు ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు. ఉత్సవాలను పురస్కరించుకుని ఏర్పాట్లపై ఆయన మాట్లాడారు. ఈ నెల 20న పూర్వారధన, 21న మధ్యారాధన, 22న ఉత్తరాధనలు జరుగుతాయన్నారు. కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలతో పాటు ఏపీలోనూ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఇస్తున్న నేపథ్యంలో ఈ ఏడాది సుమారు 5 లక్షల మంది భక్తులు వస్తారని అంచనా వేసినట్లు తెలిపారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల కోసం వసతి, కల్యాణమండపాలు, శుభ్రమైన రోడ్లు, క్యూలైన్లు, నదితీరంలో స్నానఘట్టాలు, ఉచిత అన్నదానం, తాగునీరు, ఉచిత వైద్య కేంద్రాలు వంటి మెరుగైన సౌకర్యాలు ఏర్పాటు చేశామన్నారు. ఉత్సవాలకు కలెక్టర్ పి.రంజిత్‌బాషా, ఎస్పీ బిందు మాధవ్, సబ్ కలెక్టర్ శివ్ నారాయణశర్మ, డీఆర్వో మధుసూదన్‌రావు, డీపీవో నాగరాజునాయుడు ఇతర అధికారులు సహకరిస్తున్నారని తెలిపారు. ఏడు రోజుల పాటు జరిగే ఉత్సవాలకు 7 లక్షలు పరిమళ ప్రసాదం పంపిణీకి సిద్ధం చేస్తున్నామన్నారు. రాఘవేంద్ర అనుగ్రహ ప్రశస్తి అవార్డులు -2024లో వివిధ సేవా రంగాల్లో విశిష్ట సేవలు అందించిన నలుగురికి పీఠాధిపతి ఎంపిక చేశామని 20వ తేదీన ముగ్గురికి, 22న మహారథోత్సవం దగ్గర మైసూరు రాజుకు పీఠాధిపతి అవార్డును ప్రదానం చేస్తారన్నారు.

కర్నూలు జేసీగా నవ్య

- గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టరు నుంచి జేసీగా బదిలీ
- ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- జాయింట్ కలెక్టర్‌గా తొలి సారిగా బాధ్యతలు



కర్నూలు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి)/ కర్నూలు కలెక్టరేట్: కర్నూలు జిల్లా జాయింట్ కలెక్టర్ (జేసీ)గా బి.నవ్య నియమితులయ్యారు. ఈమేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రంలో 11 మంది ఐఏఎస్ అధికారులు బదిలీ అయ్యారు. గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టరుగా పని చేస్తున్న నవ్యను కర్నూలు జేసీగా బదిలీ చేశారు. ఇక్కడ జేసీగా పని చేసిన నారపురెడ్డి మౌర్యను తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా ప్రభుత్వం ఇటీవలే బదిలీ చేసింది. ప్రస్తుతం డీఆర్వో మధుసూదన్‌రావు ఇన్‌చార్జి జేసీగా కొనసాగుతున్నారు. కర్నూలు జేసీగా నియమితులైన నవ్య త్వరలోనే బాధ్యతలు స్వీకరిస్తున్నట్లు ఆంధ్రజ్యోతికి వివరించారు. రాజమండ్రి జిల్లాకు చెందిన బి.నవ్య తండ్రి రాంమోహన్‌రావు ఉద్యోగరీత్యా ఈ ప్రాంతంలోనే ఎక్కువ కాలం పనిచేశారు. దీంతో ఆమె ఒకటో తరగతి నుంచి ఇంటర్ వరకు రాజమండ్రిలోనే విద్యాభ్యాసం సాగించారు. డెంటల్ డాక్టర్‌గా కొనసాగుతున్న ఆమె 2009లో గ్రూప్-1 పరీక్షల్లో ప్రతిభ కనబరిచి హైదరాబాదులోని సీసీఎల్‌ఏలో బాధ్యతలు చేపట్టారు. తరువాత హైదరాబాద్ డివిజన్ ఆర్డీఓగా, మర్రిచెన్నారెడ్డి మానవ వనరులు అభివృద్ధి సంస్థ (ఎంసీహెచ్‌ఆర్‌డీ) ఫ్యాకల్టీగా పని చేశారు. రాష్ట్ర విభజన తరువాత ఏపీకి వచ్చిన ఈమె సీసీఎల్‌ఏ పీడీ సీఎంఆర్‌ఓ, కొవ్వూరు ఆర్డీఓ, నెల్లూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (నుడా) వైస్ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించారు. 2016లో ఐఏఎస్ అధికారిగా పదోన్నతి పొందారు. పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేట ఐటీడీఏ పీవోగా బాధ్యతలు నిర్వర్తించారు. అక్కడి బదిలీఅయి గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టరుగా గత నెల 24 బాధ్యతలు చేపట్టారు. ఇంతలోనే కర్నూలు జేసీగా ప్రభుత్వం బదిలీ చేసింది. సీతంపేట ఐటీడీఏ పీవోగా పని చేస్తున్న సమయంలో ఆరో తరగతి చదువుతున్న కుమారుడు బి.శ్రీకర్ ప్రతీక్‌ను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించారు. ఓ ఐఏఎస్ అధికారి కొడుకును ప్రభుత్వ పాఠశాలలో చేర్పించడం అప్పట్లో చర్చగా మారింది.

కొత్తగా నాలుగు ఎక్స్‌ప్రెస్ బస్సులు

జెండా ఊపి ప్రారంభించిన మంత్రి టీజీ భరత్

కర్నూలు(రూరల్)ఆగస్టు10: ప్రయాణికుల సౌకర్యార్థం కోసం ఆర్టీసీ యాజమాన్యం మరో నాలుగు కొత్త ఎక్స్‌ప్రెస్ బస్సులను ఏర్పాటు చేసింది. శనివారం కర్నూలు-1డిపో గ్యారేజిలో పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత ముఖ్య అతిథిగా హాజరై జెండా ఊపి నూతన బస్సులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ త్వరలో మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించేందుకు సీఎం చంద్రబాబు విధివిధానాలు రూపొందించి వాటిని అమలు పరుస్తామన్నారు. కొత్త బస్సులను కర్నూలు నుంచి ఆదోని, ఎమ్మిగనూరు, శ్రీశైలంతో పాటు ఎమ్మిగనూరు-హైదరాబాద్ మార్గాల్లో ప్రయాణిస్తాయని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ జిల్లా ప్రజా రవాణా అధికారి శ్రీనివాసలు, కర్నూలు-1,2డిపో మేనేజర్లు సుధారాణి, సర్దార్‌హుస్సేన్, డిపో అసిస్టెంట్లు మేనేజర్లు, సూపర్‌వైజర్లు, సిబ్బంది ఉన్నారు.



కొత్త బస్సులను ప్రారంభిస్తున్న మంత్రి టీజీ భరత్, ఎమ్మెల్యే గౌరు చరిత

సినీ ఫక్కీలో కారు అపహరణ

మూడు రోజుల్లోనే ఛేదించిన పోలీసులు



వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

ఎమ్మిగనూరు రూరల్, ఆగస్టు 10: కారు అపహరణ కేసును పోలీసులు మూడు రోజుల్లోనే ఛేదించారు. ఎమ్మిగనూరు రూరల్ సీఐ విక్రమ్‌సింహ వివరాల మేరకు.. కర్ణాటకలోని బాగల్‌కోట్ జిల్లా ముదొల్‌కోడ్‌కు చెందిన అనీల్ బీరాదార్, శిరోర్‌కు చెందిన సంతోష్‌హట్టిలు హైదరాబాద్ నుంచి మంత్రాలయం వెళ్లాలని ఉబర్‌లో కారును బుక్ చేసుకున్నారు. కారు ఓనర్ ప్రసాద్ అనీల్, సంతోష్‌లను కాచిగూడ దగ్గర ఎక్కించుకొని జడ్చర్ల మీదుగా మహబూబ్‌నగర్, రాయచూరు మీదుగా మంత్రాలయం వరకు వెళ్లాడు. కారులో వచ్చిన ఇద్దరు మంత్రాలయంలో దిగకుండా సమీపంలోనే మరో ఊరిలో తెలిసిన వారు ఉన్నారని, అక్కడికి వెళ్దామని చెప్పారు. అలా జాతీయ రహదారి మీదుగా ఎమ్మిగనూరు వైపునకు తీసుకెళ్లారు. నందవరం మండలం హాలహర్వి గ్రామం దాటిన తరువాత కారు ఆపారు. స్నానాలు చేసి వస్తామని చెప్పి కొంత దూరం అలా ముందుకు వెళ్లి మళ్లీ కారు దగ్గరకు వచ్చారు. కారులో ఉన్న డ్రైవర్ ప్రసాద్‌కు ముఖంపై మత్తు మందును స్ప్రే చేసే ప్రయత్నం చేశారు. అప్రమత్తమైన ప్రసాద్ ఇరువురిని నెట్టివేసి కారులో మంత్రాలయం వైపు పరుగులు తీశాడు. అక్కడి పోలీసులకు ఫిర్యాదు చేయగా తమ పరిధిలోకి రాదని, నందవరం పోలీస్ స్టేషన్ పరిధిలోకి వస్తుందని చెప్పడంతో అక్కడి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆ తరువాత దుండగులు కారును అక్కడి నుంచి కర్ణాటకలోని గుర్తు తెలియని ప్రాంతానికి తీసుకెళ్లారు. ఫిర్యాదు అందుకున్న సీఐ విక్రమ్‌సింహ కర్ణాటకలోని రాయచూరు జిల్లా గిలకసూగూరు క్యాంపు దగ్గర నిందితుల్లో ఒకరైన అనీల్ బారాదర్‌ను అదుపులోకి తీసుకొని కారును స్వాధీనం చేసుకున్నారు. పరారిలో ఉన్న సంతోష్‌హట్టి అనే నిందితుడి కోసం గాలిస్తున్నారు.

త్వరలో కేడీసీసీబీ విభజన

నంద్యాలలో జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ద్వారా రైతులకు సేవలు

కర్నూలు(అగ్రికల్చర్), ఆగస్టు 10: జిల్లా సహకార కేంద్ర బ్యాంకును త్వరలోనే విభజించనున్నారు. ఈ క్రమంలోనే నంద్యాలలో జిల్లా సహకార కేంద్ర బ్యాంకును ఏర్పాటు చేసేందుకు మార్గం సుగమమైంది. అమరావతిలో ఇటీవల జరిగిన జిల్లా సహకార కేంద్ర బ్యాంకుల సీఈవో సమావేశంలో ఉన్నతాధికారులు ఈ మేరకు స్పష్టత ఇచ్చారు. దాదాపు వందేళ్ల చరిత్ర కలిగిన కర్నూలు జిల్లా సహకార కేంద్ర బ్యాంకుకు ప్రధాన కార్యాలయంతోపాటు 20 శాఖలు, మరో 99 ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు ఉన్నాయి. ఈ బ్యాంకు ద్వారా రైతులకే కాకుండా మిగిలిన వర్గాలకు సైతం ప్రయోజనాలు అందిస్తున్నారు. దాదాపు రూ.3,500 కోట్ల వ్యాపార అభివృద్ధితో జిల్లా సహకార కేంద్ర బ్యాంకుల్లో కర్నూలు జిల్లా సహకార కేంద్ర బ్యాంకుకు రెండో స్థానం దక్కించుకుంది. గత మూడు సంవత్సరాలుగా ప్రభుత్వం నుంచి అవార్డును కైవసం చేసుకుంది. సహకార కేంద్ర బ్యాంకును విభజించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో ప్రస్తుతం కర్నూలు కేంద్రంగా కార్యకలాపాలను నిర్వహిస్తున్న జిల్లా సహకార కేంద్ర బ్యాంకు రెండుగా విభజించనున్నారు. ప్రస్తుతం వివిధ బ్రాంచులు, సింగిల్ విండోలను ఏ జిల్లాలోని సహకార కేంద్ర బ్యాంకు పరిధిలోకి తేవాలో అధికారులు నిర్ణయం తీసుకునే విషయంలో చర్చిస్తున్నారు. ప్రస్తుతం డీసీసీబీ పాలకవర్గాల పర్సన్ల ఇన్‌చార్జిల పదవీ కాలం ముగిసింది. జిల్లా జాయింట్ కలెక్టర్ డీసీసీబీ పర్సన్ ఇన్‌చార్జిగా కొనసాగుతున్నారు. త్వరలోనే బ్యాంకు విభజన ప్రక్రియ పూర్తయితే.. రైతులకు పూర్తి స్థాయిలో అందుబాటులో సేవలు దక్కనున్నాయి.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి

బేతంచెర్ల, ఆగస్టు 10: మండలంలోని బుగ్గానిపల్లె-కృష్ణమ్మ కోన రైల్వేస్టేషన్ల మధ్య రైలు నుంచి జారి పడి గుర్తు శనివారం తెలియని వ్యక్తి మృతి చెందాడు. నంద్యాల జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ ఖలీల్ వివరాల మేరకు.. తుగ్గలి రైల్వేస్టేషన్‌లో రాత్రి 11.30 గంటలకు డోన్‌కు వెళ్లేందుకు 55 ఏళ్ల వ్యక్తి టికెట్ తీసుకుని రైలులో ప్రయాణించాడు. డోన్‌లో దిగకుండా రైలులో ప్రయాణిస్తూ ప్రమాదవశాత్తు సిమెంటునగర్ కృష్ణమ్మ కోన రైల్వేస్టేషన్ల మధ్య జారి కింద పడ్డాడు. తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. శనివారం ఉదయం రైల్వే సిబ్బందికి సమాచారం అందడంతో సంఘటనా స్థలానికి చేరకుని మృతదేహాన్ని నంద్యాల రైల్వే ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భార్య హత్య కేసులో భర్త అరెస్టు

కోడుమూరు (రూరల్), ఆగస్టు 10: మండలంలోని పులకుర్తిలో భార్యను హత్య చేసిన భర్తను పోలీసులు అరెస్టు చేశారు. శనివారం సాయంత్రం కార్యాలయంలో సీఐ మన్సూరుద్దీన్ కేసు వివరాలను వెల్లడించారు. పులకుర్తి గ్రామానికి చెందిన కొలాయి సుంకన్న, నాగలక్ష్మి దంపతుల కూతురు మల్లేశ్వరిని బస్తిపాడుకు చెందని రంగడుతో వివాహం జరిపించారు. అయితే తాగుడుకు బానిసైన రంగడు భార్యా పిల్లలను హింసించేవాడు. దీంతో విసుగు చెందిన మల్లేశ్వరి తన ముగ్గురు పిల్లలను తీసుకుని గత నెలలో పుట్టింటికి చేరుకుంది. వెనువెంటనే చేరుకున్న రంగడు మంచిగా ఉంటానని అత్తామామలను నమ్మించాడు. ఈ క్రమంలో గత నెల 31న అర్ధరాత్రి పూటుగా తాగి వచ్చిన రంగడు భార్య, అత్తామామలతో గొడవకు దిగాడు. రోకలిబండతో భార్య, అత్తలపై దాడి చేసి తలపై కొట్టాడు. అడ్డు వచ్చిన మామపై కూడా దాడికి పాల్పడడంతో కుడి చేతికి గాయాలయ్యాయి. దీంతో తీవ్రంగా గాయపడిన తల్లీ కూతుళ్లను కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే చికిత్స పొందుతున్న భార్య మల్లేశ్వరి కోలుకోలేక ఈనెల 3వ తేదీ మృతి చెందింది. అత్త నాగలక్ష్మి అపస్మారక స్థితిలో చికిత్స పొందుతోంది. కేసు నమోదు చేసిన పోలీసులు శనివారం పట్టణంలోని తాత గుడి వద్ద నిందితుడు రంగడును అరెస్టు చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఐ బాలనరసింహులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్యాపిలి, ఆగస్టు 10: మండలంలోని ఏనుగమర్రి గ్రామం సమీపంలో 44వ జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో సత్యసాయి జిల్లా కదిరికి చెందిన క్లీనర్ శంకర్(34) మృతి చెందాడు. మదనపల్లి నుంచి చీనీ కాయల లోడుతో లారీ నాగపూర్‌కు బయలుదేరింది. మార్గమధ్యలోని ఏనుగమర్రి దగ్గరకు రాగానే రోడ్డుపై నిలబడిన మరో వాహనాన్ని లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో క్లీనర్ శంకర్‌కు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆంధ్రజ్యోతి చిన్న ప్రకటన - పెద్ద స్పందన CLASSIFIEDS

WANTED
కర్నూలులోని ప్రముఖ రియల్ ఎస్టేట్ ఆఫీస్‌లో పనిచేయుటకు టెలికాలర్స్, మార్కెటింగ్ టీమ్ లీడర్స్ కావలెను. అర్హత : ఏదైనా డిగ్రీ, కంప్యూటర్ పరిజ్ఞానం వుండాలి. సంప్ర.85003 53549, 85003 53548.
AJL-195773

PLOT FOR SALE
R.R Realestate kurnool to Banglore రోడ్డు లక్ష్మీపురం జగన్నాథగట్టు రోడ్డుకు, రిడ్జ్ స్కూల్ దగ్గర (30x50) (30x40) సైజులు గల ఓపెన్ ప్లాట్స్ అన్ని సౌకర్యాలతో అమ్మకానికి కలవు. సంప్ర: అన్నం శ్రీనివాసులు. 91828 21014.
AJL-195762

బంగారం కొనబడును
మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్ షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ. సంప్ర॥ 7382114647
AJA-189295

PLOT FOR SALE
కర్నూలు to బెంగళూరు రోడ్‌లో దుపాడు రిడ్జ్ స్కూల్ దగ్గర, అరుణాచల గ్రీన్ సిటీ వెంచర్ నందు (30x50) & (30x40) సైజులు గల ఓపెన్ ప్లాట్స్ అన్ని సౌకర్యాలతో అమ్మకానికి కలవు. శ్రీనివాస్. 91828 21014.
AJL-195774

మా చిత్రంలో నటించే అవకాశం
★ శ్రీ వెంకట లక్ష్మీనరసింహ ప్రొడక్షన్స్‌లో బాలా బాలకృష్ణ చిత్రం సెప్టెంబర్ 19న రామానాయుడు స్టూడియోలో షూటింగ్ ప్రారంభం. అన్ని వయసుల కొత్త వారికి యాక్టింగ్ ఫ్రీగా నేర్పిస్తున్నాం. మా సినిమాలో అవకాశం ఇస్తున్నాం. నూతన నటీనటులు కావలెను. మీ ఫోటోలు మా వాట్సప్ నెం.7981403355కు పంపండి. ఫిలింనగర్ Hyd. నరసింహారెడ్డి డైరెక్టర్.
AJH-002567

PLOT FOR SALE
➡ APCRDA అప్రూవ్డ్ ప్లాట్స్ ORR- రింగురోడ్డు ఆనుకొని అమరావతి రాజధానికి, ఐకానిక్ బ్రిడ్జి దగ్గరలో గేటెడ్ కమ్యూనిటీ నందు కలవు. బ్యాంక్ లోన్. సంప్ర॥ 9014437611, 7730099126.
AJG-9523

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన/క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటన దారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు. మేనేజర్ - ఏడివిటి

వెంకటాపురంలో గోవిందనామ స్మరణ

గుంటి రంగస్వామికి జలాభిషేకం



గుంటి రంగస్వామి ఆలయం చుట్టూ బోర్ల పడుకున్న మహిళా భక్తులు



గుంటి రంగస్వామి

ఎమ్మిగనూరు, ఆగస్టు 10: ఎమ్మిగనూరు పట్టణంలోని వెంకటాపురం కాలనీ గోవిందనామస్మరణతో మార్మోగింది. శ్రావణ మాసం తొలి శనివారం పురస్కరించుకొని పవిత్ర తుంగభద్ర నదీ జలాలతో గుంటిరంగ స్వామికి అభిషేకం చేశారు. పూజారి తిమ్మప్ప ఆధ్వర్యంలో కాలనీ వాసులు పట్టణానికి 25 కి.మీ. దూరంలో ఉన్న తుంగభద్ర నదికి కాలినడకన వెళ్లడం ఆనవాయితీ. ఇందులో భాగంగా శుక్రవారం కాలనీకి చెందిన వందలాది మంది యువకులు ఆలయ నిర్వాహకుల ఆధ్వర్యంలో పూలతో అలంకరించిన బరిసెలు, వేటకొడవళ్లు, గొండ్రగొడ్డళ్ల వంటి ఆయుధాలు, బిందెలతో తుంగభద్ర నదికి చేరుకున్నారు. నది నుంచి నీటిని తీసుకొని తిరిగి కాలనీకి చేరుకోవడంతో ఆడపడుచులు కలశాలతో ఘన స్వాగతం పలికారు. కోరిన కోర్కెలు తీరాలని నెలకొన్న కష్టాలు తొలగాలని కాలనీకి చెందిన పలువురు మహిళలు, భక్తులు ఆలయం ముందు, ఆలయం పక్కన బోర్ల పడుకున్నారు. నది నుంచి వచ్చిన వారు పడుకున్నవారిని దాటుకుంటూ వెళ్తే వారి పాద ధూళి తగిలి తమ కష్టాలు తొలుగుతాయని ఇక్కడి భక్తుల నమ్మకం. ఈ ఏడాది కూడా కాలనీకి చెందిన పదుల సంఖ్యలో మహిళా భక్తులు బోర్ల పడుకున్నారు. దీంతో వారిని దాటుతూ నదీజలం తెచ్చిన భక్తులు పరుగులు తీస్తూ ప్రదక్షిణలు చేశారు. పడుకున్న వారికి ఆలయం నిర్వాహకులు నీటిని చల్లి ప్రదక్షిణల అనంతరం లేపడం కనిపించింది. వేడుకను తిలకించేందుకు కాలనీతోపాటు పట్టణ ప్రజలు కూడా పెద్ద ఎత్తున తరలిరావడంతో ఆ ప్రాంతమంతా సందడిగా మారింది.



ఆలయం ముందు పోటెత్తిన భక్తులు

పెళ్లిసందడి
పచ్చని తోరణాల నడుమ వేదమంత్రోచ్చరణాల మధ్య మూడుముళ్ళబంధంతో ఒక్కటవుతున్న నూతన వధూవరులకు ఆంధ్రజ్యోతి దినపత్రిక ద్వారా శుభాకాంక్షలు తెలియజేయండి.
ఆంధ్రజ్యోతి కార్యాలయం: నియర్ ఇండస్ స్కూల్, పందిపాడు గ్రామం, కర్నూలు. సెల్ : 9985411369
కర్నూలు: 99854 11141, 99854 02424, 99854 02544, 97036 18696, 99854 02890, 99591 77333,
ఆదోని: 97036 18726,
ఎమ్మిగనూరు: 78931 48646,
నంద్యాల: 99854 02121
డోన్: 94911 02749
నందికొట్కూరు: 83092 18935

పుట్టగొడుగుల్లా ఇటుక బట్టీలు

» రహదారి పక్కనే ఏర్పాటు.. వాహన చోదకుల ఇక్కట్లు
» కార్మికులకు మౌలిక వసతులు కరువు


కాల్వబుగ్గలో ప్రధాన రహదారి పై పక్కన్న ఉన్న ఇటుక బట్టీ

ఓర్వకల్లు, ఆగస్టు 10: కర్నూలు-చిత్తూరు జాతీయ రహదారి-40పై ఇటుక బట్టీలు పుట్టగొడుగుల్లా వెలిశాయి. ఏర్పాటుతో వాహన చోదకులు, ప్రయాణికులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటుకలు కాల్చే సమయంలో దుమ్ము, ధూళి నిప్పు రవ్వలు గాలికి ప్రయాణికుల కళ్లలో పడుతుండటంతో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని పలువురు వాపోతున్నారు. మండలంలోని సోమయాజులపల్లె, కాల్వబుగ్గ, హుశేనాపురం జాతీయ రహదారి పక్కన అనుమతులు లేకుండా ఇటుక బట్టీలు పుట్టుకు వస్తున్నాయని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. అక్రమంగా విద్యుత్‌ను కూడా వినియోగిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇంత జరుగుతున్నా అధికారులు ఇటువైపు కన్నెత్తి చూడడం లేదు. గ్రామస్థులు ఎవరైనా అధికారులకు ఇటుక బట్టీలపై ఫిర్యాదు చేస్తే అధికారులు తూతూ మంత్రంగా తనిఖీ చేస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. అలాగే ఏపీఆర్ గురుకుల పాఠశాల విద్యార్థులు ఇటుక బట్టీల పొగతో ఇబ్బందులు పడుతున్నారు. ఇటుక బట్టీల్లో కర్ణాటక, తమిళనాడు, ఒడిస్సా, తెలంగాణ ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కార్మికులుగా పని చేస్తున్నారు. అయితే యాజమాన్యం సరైన మౌలిక సదుపాయాలు కల్పించకపోవడంతో బిక్కుబిక్కుమంటూ పూరి గుడిసెల్లో నివాసం ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. 2023 డిసెంబరు 11న బట్టలు ఉతికేందుకు వెళ్లి తొట్టి కూలడంతో ఇద్దరు మహిళలుమృతి చెందిన విషయం విదితమే. అయినా మౌలిక సదుపాయాలు కల్పించలేదు. ఇటుక బట్టీల్లో బాలకార్మికులు పని చేస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అనుమతులు లేని బట్టీలను సీజ్ చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పొగ, నిప్పు రవ్వలతో ఇబ్బందులు



రహదారి పక్కనే ఉన్న ఇటుక బట్టీలను కాల్చే సమయంలో వచ్చే పొగ, దుమ్ము ధూళి, నిప్పు రవ్వలతో ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ప్రయాణికులు వాహనదారులు పొగతో తల్లడిల్లుతున్నారు. దీనిపై అధికారులు చర్యలు తీసుకోవాలి.

- కేవీ మధు, ప్రయాణికుడు

అన్నీ అక్రమమే



ఇటుక బట్టీలకు నల్లమట్టి దగ్గర నుంచి విద్యుత్ వరకు సగభాగం అన్నీ అక్రమమే. అయితే.. ఈ విషయంపై అధికారులు పట్టించుకోరు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అక్రమాలను అరికట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

- నాగరాజు, మాజీ ఎంపీటీసీ హుశేనాపురం

అనుమతులు లేని ఇటుక బట్టీలపై చర్యలు తీసుకుంటాం



కాల్వబుగ్గ రహదారిపై ఏర్పాటు చేసిన అనుమతులు లేని ఇటుక బట్టీలపై చర్యలు తీసుకుంటాం. అనుమతులు లేకుంటే వాటిని కూడా సీజ్ చేస్తాం. కార్మికులకు వసతులు కల్పించడంలో చర్యలు తీసుకుంటాం.

- వెంకటరమణ, తహసీల్దార్, ఓర్వకల్లు

ప్రిన్సిపాల్‌కు రాజీవ్ గాంధీ లెజెండరీ అవార్డు


అవార్డును అందుకుంటున్న ప్రిన్సిపాల్ నాగస్వామి నాయక్

కర్నూలు(ఎడ్యుకేషన్), ఆగస్టు 10: బీ.క్యాంపు ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.నాగస్వామి నాయక్ రాజీవ్ గాంధీ లెజెండరీ అవార్డును అందుకున్నారు. అభిలాష హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ ఆధ్వర్యంలో శనివారం హైదరాబాదు రవీంద్ర భారతి ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ ఎస్.సరోజమ్మ చేతుల మీదుగా నాగస్వామి అవార్డును అందుకోనున్నారు. ఉత్తమ సేవలు అందించినందుకు ఈ ఏడాది ప్రిన్సిపాల్‌కు అవార్డు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ముక్తుల్ ఎమ్మెల్యే వీ.శ్రీహరి, సంస్థ ప్రతినిధులు, కళాశాల బోధనా, బోధనేతర సిబ్బంది ప్రిన్సిపాల్ నాగస్వామి నాయక్‌ను అభినందించారు.

కోట్ల కుటుంబంపై ఆరోపణలు తగవు


మాట్లాడుతున్న చరణ్ కుమార్

గూడూరు, ఆగస్టు 10: కోట్ల కుటుంబంపై ఆరోపణలు తగవని కర్నూలు పార్లమెంటు తెలుగు యువత కార్యదర్శి చరణ్ కుమార్ అన్నారు. శనివారం గూడూరు పట్టణంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత కొన్ని రోజుల నుంచి సోషల్, బ్లూ మీడియాలో కోట్ల కుటుంబంపై బురద జల్లాలనే దురుద్దేశంతో వైసీపీ నాయకులు లేనిపోని ఆరోపణలు చేస్తున్నారన్నారు. నాయకులు అయ్యవారి నాయుడు, నాగరాజు, గోవిందు, రంగడు, సురేష్ పాల్గొన్నారు.

కర్నూలు జీజీహెచ్‌లో స్క్రాప్ టెండరు రద్దు

కర్నూలు(హాస్పిటల్), ఆగస్టు 10: కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో స్క్రాప్ టెండర్ వేలంను రద్దు చేసినట్లు ఆసుపత్రి సూపరిం టెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తదుపరి తేదీలను త్వరలో ప్రకటిస్తామన్నారు. మళ్లీ కొత్తగా దరఖాస్తులు తీసుకుం టామని, ఇప్పటికే అప్లికేషన్ రుసుం చెల్లించిన వారికి డబ్బును సర్దుబాటు చేస్తామన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 15 కేసులు నమోదు

కర్నూలు, ఆగస్టు 10: నగరంలో ట్రాఫిక్ పోలీసులు శనివారం రాత్రి 15 డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. స్థానిక కిడ్స్ వరల్డ్ వద్ద ట్రాఫిక్ సీఐ గౌతమి ఆధ్వర్యంలో తనిఖీలు చేశారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 10 ద్విచక్రవాహనదారులు, ఒక కారు, నాలుగు ఆటో డ్రైవర్లపై కేసులు నమోదు చేశారు. వీరిని కోర్టులో హాజరుస్తామని సీఐ గౌతమి తెలిపారు.

ముస్లింలు పోరాటాలకు సిద్ధం కావాలి

కోడుమూరు, ఆగస్టు 10: ముస్లింల వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న బీజేపీ ప్రభుత్వంపై పోరాటాలకు సిద్ధం కావాలని ఇన్సాఫ్ కమిటీ నాయకులు ఆసీఫ్ పిలుపునిచ్చారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో శనివారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ముస్లింలను అణిచివేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తుందని అన్నారు. కేంద్రంలో వక్ఫ్ బోర్డు ఆస్తులపై ఆంక్షలు విధిస్తుందన్నారు. కార్యక్రమంలో ముస్లింలు హీరావలి, హనీఫ్, సుభాన్, ఖాదర్, అక్బర్, ఇబ్రహీం పాల్గొన్నారు.

పంట నమోదు తప్పనిసరి: ఏవో

ఓర్వకల్లు, ఆగస్టు 10: రైతులంతా పంట నమోదు తప్పనిసరిగా చేసుకోవాలని, పంట నమోదు చేసుకుంటేనే ప్రభుత్వ పథకాలు లభిస్తాయని ఏవో సుధాకర్ అన్నారు. శనివారం మండలంలోని గుట్టపాడు, ఎన్.కొంతలపాడు, హుశేనాపురం, సోమయాజులపల్లె తదితర గ్రామాల్లో జరుగుతున్న ఈ పంట నమోదును పొలాలకు వెళ్లి ఆయన పరిశీలించారు. సెప్టెంబరు 15వ తేదీలోపు వంద శాతం పంట నమోదు పూర్తి చేయాలని ఆయన సిబ్బందిని ఆదేశించారు.

'అధికారం పోయినా కుట్రలు మానని జగన్'


మాట్లాడుతున్న గోవిందరెడ్డి

ఓర్వకల్లు, ఆగస్టు 10: మాజీ సీఎం జగన్ రెడ్డి అధికారం కోల్పోయినా కుట్రలు మానడం లేదని టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ప్రజలకు మంచి జరగడం జగన్‌కు ఇష్టం లేదన్నారు. సీతారామాపురంలో వైపీపీలోనే రెండు వర్గాలు ఘర్షణ పడి వ్యక్తి హత్యకు గురైతే.. ఆ నేరం టీడీపీపై నెట్టడం సిగ్గు చేటన్నారు. ఎక్కడ దాడులు జరిగినా టీడీపీపైనే రుద్దుతూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. ఇలాగే కుట్రలు చేస్తే ప్రజలే మరోసారి జగన్‌కు బుద్ధి చెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు లక్ష్మీకాంతరెడ్డి, గోపాల్ రెడ్డి, అబ్దుల్లా, గౌస్, అన్వర్‌బాషా, ఆదాం బాషా, నాగరాజు, వేణుగోపాల్ రెడ్డి, శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.

తాగునీరు, వీధి దీపాల ఏర్పాటు

కర్నూలు(కలెక్టరేట్), ఆగస్టు 10: జగన్నాథగట్టు సమీపాన గల హౌసింగ్ కాలనీ వాసులు తాగునీరు, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని అధికారులను కోరారు. ఈమేరకు జిల్లా పంచాయతీ అధికారి నాగరాజు నాయుడు కాలనీలో తాగునీరు, వీధి దీపాలు ఏర్పాటు చేస్తామని శనివారం హామీ ఇచ్చారు.

అధ్వానంగా చింతమానుపల్లె రోడ్డు


చింతమానుపల్లె రోడ్డు దుస్థితి

సి.బెళగల్, ఆగస్టు 10: మండలంలోని చింతమనుపల్లెకు వెళ్లే రోడ్డు గుంతలు పడి రాళ్లు తేలి అధ్వానంగా తయారైంది. రోడ్డు వేయించాలని గత ఐదేళ్ల నుంచి అధికారులు, నాయకులకు మొరపెట్టుకుంటున్నా పట్టించుకోవడంలేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చింతమానుపల్లె రహదారికి మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో తాగునీరు అందించాలి



మాట్లాడుతున్న సాయి ఉదయ్

కర్నూలు(న్యూసిటీ), ఆగస్టు 10: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు తాగడానికి తాగునీరు అందించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు సాయి ఉదయ్ డిమాండ్ చేశారు. శనివారం కార్యాలయంలో నిర్వహించిన మండల కమిటీ సమావేశంలో ఉదయ్ మాట్లా డుతూ ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి చేశామని గత ప్రభుత్వం అనేక ప్రకటనలు చేసిందని, అయితే పాఠశాలల్లో తాగడానికి తాగునీరు కూడా లేవని అన్నారు. విద్యార్థులు మరుగుదొడ్లకు వాడకా నికి కూడా ఇబ్బంది పడాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. గత ప్రభుత్వం నాడు నేడు కింద మినరల్ వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేయడానికి లక్షలు ఖర్చుచేసిన ఆచరణలో మాత్రం జరగలేదన్నారు. అనంతరం మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా అంజి, కో కన్వీనర్‌గా జుబేర్, సభ్యులుగా లోకేష్, రాజేష్, వేణు, ఠాగూర్, చిన్న, గౌతమ్‌లను ఎన్నుకున్నారు.

జాతీయ సమావేశాలను జయప్రదం చేయాలి

కర్నూలు(న్యూసిటీ), ఆగస్టు 10: విశాఖపట్టణంలో సెప్టెంబరు 1,2,3, తేదీలలో జరిగే ఏఐటీయూసీ జాతీయ సమితి సమావేశాలను జయప్రదం చేయాలని రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జే.లలిత పిలుపునిచ్చారు. శనివారం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ కార్మిక హక్కుల రక్షణ, కార్పొరేట్ల సంపద ప్రజలకు పంచాలని, భవిష్యత్తు కార్మిక ఉద్యమ నిర్ణయాలు జరుగుతాయన్నారు. జిల్లా నుంచి ఉద్యోగులు, కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప నగర కార్యదర్శి జి.చంద్రశేఖర్, డిప్యూటీ జనరల్ సెక్రటరీ కృష్ణయ్య, ఉపాధ్యక్షుడు రామాంజనేయులు, బీ రాజు, ఓబీ నాగరాజపు పాల్గొన్నారు.

మురుగు కాలువలను మూసి ఉంచొద్దు

కర్నూలు(న్యూసిటీ), ఆగస్టు 10: నగరంలో మురుగు కాలువలను మూసి ఉంచొద్దని నగర పాలక సంస్థ కమిషనర్ పీవీ రామలింగేశ్వర్ ప్రజలను కోరారు. శనివారం మెడికల్ కళాశాల వద్ద జరుగుతున్న పూడిక తీత పనులను కమిషనర్ తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న, పెద్దపాటి మురుగు కాలువల వద్ద పూడికతీత పనులు జరుగుతున్నాయన్నారు. అయితే కాలువలను పైకప్పులతో మూసి పెట్టవద్దని కోరారు. వీటి వల్ల పూడికతీత పనులు చేపట్టడం కష్టతరంగా మారిందన్నారు. ఎవ్వరైనా కాలువలపై శాశ్వత నిర్మాణాలు చేపడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కొళాయి కనెక్షన్లపై ఇంటింటి సర్వే

కర్నూలు(న్యూసిటీ), ఆగస్టు 10: ఇంటింటికి కొళాయిల కనెక్షన్లపై సర్వే చేపడుతున్నట్లు నగర పాలక సంస్థ కమిషనర్ పీవీ రామలిం గేశ్వర్ తెలిపారు. శనివారం పురపాలక శాఖ డైరెక్టర్ హరినారాయణ విజయవాడ నుంచి మున్సిపల్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్సు ద్వారా సమీక్ష నిర్వహించారు. స్థానిక ఎస్‌బీఐ కాలనీ నూతన కౌన్సిల్ హాలులో నిర్వహించిన కాన్ఫరెన్సులో కమిషనర్‌తో పాటు రెవెన్యూ, ఇంజనీరింగ్ విభాగాల అధికారులు, అడ్మిన్, అమ్యూనిటీస్ సెక్రటరీలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రతి ఇంటికి తాగునీటి కనెక్షన్ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఇందులో భాగంగా తొలుత ఇంటింటి సర్వే చేయనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో డీఈఈ రవిప్రకాష్‌నాయుడు, ఆర్‌ఓలు జునీద్, ఇజ్రా యేల్, ఏఈ జనార్దన్, ఆర్‌ఐలు పాల్గొన్నారు.

నగర పాలక సంస్థ కమిషనర్‌గా రవీంద్రబాబు?

కర్నూలు(న్యూసిటీ), ఆగస్టు 10: నగర పాలక సంస్థ కమిషనర్‌గా రవీంద్రబాబును ప్రభుత్వం నియమించనున్నట్లు తెలిసింది. గతంలో రెండు పర్యాయాలు ఇక్కడే పని చేసిన అనుభవం ఉంది. ప్రస్తుతం ఆయన మంగళగిరిలోని సీడీఎంఏ కార్యాలయంలో పని చేస్తున్నారు. 2022 ఏప్రిల్‌లో కమిషనర్‌గా బాధ్యతలు తీసుకున్న ఎ.భార్గవతేజను జూలై 21 గుంటూరు జాయింట్ కలెక్టర్‌గా బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన విషయం విదితమే. అప్పటి నుంచి అడిషనల్ కమిషనర్ పీవీ రామలింగేశ్వర్‌కు కమిషనర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. నాలుగు సంవత్సరాలు నగర పాలక సంస్థకు కమిషనర్లుగా ఐఏఎస్ అధికారులను నియమించిన ప్రభుత్వం ప్రస్తుతం నాన్ ఐఏఎస్‌కు అవకాశం ఇవ్వడం ఏమిటని కొందరు ప్రశ్నిస్తున్నారు. రవీంద్రబాబుతోపాటు మరికొందరు కూడా కమిషనర్‌గా వచ్చేందుకు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం.

నాటుసారా స్వాధీనం.. వ్యక్తి అరెస్టు


సెబ్ పోలీసులు స్వాధీనం చేసుకున్న నాటుసారా

కోడుమూరు(రూరల్), ఆగస్టు 10: కోడుమూరు సెబ్ స్టేషన్ పరిధిలోని బొంతిరాళ్ల గ్రామంలో నాటుసారా స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ సీఐ రామాంజనేయులు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ తమకు అందిన సమాచారం మేరకు కూర్మగిరి చిన్నమాదన్న అనే వ్యక్తి వద్ద 20 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్ తరలించినట్లు వివరించారు. కార్యక్రమంలో ఎస్ఐ అలీ బేగ్, సిబ్బంది అన్సార్ బాషా, వెంకటేష్‌నాయక్, శంకర్‌నాయక్ పాల్గొన్నారు.

'విద్యారంగ అభివృద్ధికి సహకరించండి'


ఎమ్మెల్యే గౌరు చరితకు వినతిపత్రం ఇస్తున్న యూటీఎఫ్ నాయకులు

కర్నూలు(కల్చరల్), ఆగస్టు 10: విద్యారంగ అభివృద్ధికి సహకారం అందించాలని ఏపీ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) నాయకులు పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డికి విజ్ఞప్తి చేశారు. శనివారం ఎమ్మెల్యే కార్యాలయంలో ఆమెకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ నూతన విద్యా విధానం-2020 అమలు పేరుతో 2021 నుంచి రాష్ట్రంలో పలు విద్యారంగ సంస్కరణలు తీసుకు వచ్చారని, విద్యార్థి ఆసక్తి స్థాయికి నిమిత్తం లేకుండా ఒకటి నుంచి ఇంగ్లీషు మీడియం నిర్బంధం చేశారని తెలిపారు. 4,752 పాఠశాలల నుంచీ 3, 4, 5 తరగతులను వేరుచేసి సమీపంలోని హైస్కూళ్లలో విలీనం చేశారని అన్నారు. విద్యాహక్కు చట్టం ప్రకారం ఉపాధ్యాయుల సర్దుబాటు పేరుతో 13 వేల పాఠశాలలను సింగిల్ టీచర్ స్కూల్స్‌గా మార్చివేశారని అన్నారు. హైస్కూల్ ఉపాధ్యాయులను తగ్గించి పని భారం పెంచారని, సీబీఎస్ఈ, ఐబీ అంటూ రకరకాల సిలబస్‌లు ప్రవేశ పెట్టడమే కాకుండా బైజూస్, టోఫెల్ అమలుతో ప్రభుత్వ విద్యా వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం వారు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు జే సుధాకర్, ఎస్‌జీ నరహరి, జే లక్ష్మణకుమార్, విజయ్‌కుమార్, డి.కబీర్, బి.సుధీర్, జీ చిన్నరాజు, వై రమ ణారెడ్డి, ఎ సత్యనారాయణ రావు పాల్గొన్నారు.

సుంకులమ్మకు గౌరు చరిత పూజలు

కర్నూలు(కల్చరల్), ఆగస్టు 10: కల్లూరు ఎస్టేట్‌లోని చింతలముని నగర్‌లోగల సుంకులా పరమేశ్వరి దేవి ఆలయంలో శనివారం నిర్వహించిన ధ్వజస్తంబ ప్రతిష్ఠకు పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో వార్డు టీడీపీ నాయకులు రవి ప్రకాశ్‌రెడ్డి, టైలర్ నాగరాజు, రాములమ్మ, గిరి, ఖాజా పాల్గొన్నారు.

వయనాడ్ ఘటనను జాతీయ విపత్తుగా ప్రకటించాలి



ఈ.తాండ్రపాడు, కోడుమూరులలో విరాళాలు సేకరిస్తున్న సీపీఎం, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

కర్నూలు(రూరల్), ఆగస్టు 10: కేరళ రాష్ట్రంలోని వయనాడ్ ప్రాంతంలో జరిగిన ఘటనను జాతీయ విపత్తుగా ప్రకటించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు వెంకటరాముడు, మండల నాయకుడు పీబీ ఉశేనయ్య డిమాండ్ చేశారు. దేశ ప్రజలంతా వయనాడ్ వరద బాధితులకు అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు కర్నూలు రూరల్ మండలంలోని ఈ.తాండ్రపాడు, బసావాపురం గ్రామాల్లో వయనాడ్ ప్రజలకు సహాయార్థం కోసం వారు ఇంటింటికి వెళ్లి జోల పట్టి సహాయం చేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా వెంకటరాముడు, ఉశేనయ్య మాట్లాడుతూ అధిక వర్షాల వల్ల వరద ముప్పుతో కొండచరియలు విరిగిపడి దాదాపు 400 మంది చనిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. వేలాది మంది ప్రజలు క్షతగాత్రులుగా మిగిలిపోయారని వివరించారు. అలాంటి వయనాడ్ వరద బాధిత కుటుంబాలను ఆదుకునేందుకు మానవ దృక్పథంతో ఆదుకోవాలని గ్రామ ప్రజలను కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు రామకృష్ణ, సర్పంచు బాలపీరా, గోపాల్, అయ్యన్న, వెంకటేశ్వర్లు, ఖాజా, వెంకటస్వామి రాముడు తదితరులు పాల్గొన్నారు.

కోడుమూరు: కేరళ రాష్ట్రంలోని వరద బాధితులకు సహాయార్థం సీపీఎం ఆధ్వర్యంలో శనివారం విరాళాలు సేకరించారు. ఈసందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి గఫూర్‌మియా మాట్లా డుతూ కేరళ రాష్ట్రంలోని వయనాడు జిల్లాలో వరదలు బీభత్సవం సృషించడంతో ఎంతో మంది ప్రాణాలు కోల్పోయి, ఆస్తులు పోగుట్టుకో వడంతోపాటు తినడానికి తిండి దొరకని పరిస్థితుల్లో ఉన్నారని చెప్పారు. వరద బాధితుల కోసం ఒక్కరోజు వ్యాపారుల నుంచి విరాళాలు సేకరించగా రూ. 10350 వసూళ్లు అయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు వీరన్న, లక్ష్మన్న, మునుస్వామి, బుడ్డప్ప, శంకర్, బాబు, గిడ్డయ్య, మధుబాబు పాల్గొన్నారు.

గూడూరు: పట్టణంలో వయనాడ్ వరద బాధితుల కోసం సీపీఎం ఆధ్వర్యంలో శనివారం విరాళాలు సేకరించారు. సీపీఎం మండల కార్యదర్శి జే.మోహన్ మాట్లాడుతూ కేరళ రాష్ట్రంలోని వయనాడ్‌లో తీవ్రంగా నష్టపోయిన వరద బాధితుల సహయార్థం సీపీఎం ఆధ్వర్యంలో విరాళాలను సేకరిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు వెంకటే శ్వర్లు, మునెప్ప, రాజశేఖర్, దానమన్న, హమాలీ సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా యూటీఎఫ్ స్వర్ణోత్సవం



మాట్లాడుతున్న జి.పుల్లయ్య

కర్నూలు(ఎడ్యుకేషన్), ఆగస్టు 10: యూటీఎఫ్ స్వర్ణోత్సవాన్ని శనివారం సాయంత్రం రాష్ట్ర సహాధ్యక్షులు సురేష్ కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సదస్సుకు రవీంద్ర విద్యాసంస్థల అధినేత జి.పుల్లయ్య ముఖ్యఅతిథిగా హాజరై యూటీఎఫ్ జెండాను ఆవిష్కరించారు. సహాధ్యక్షుడు హేమంత్ కుమార్, జిల్లా కార్యదర్శి తిమ్మన్న, రాష్ట్ర కౌన్సిలర్ జయరాజు, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

కోడుమూరు: కోడుమూరు పట్టణంలో యూటీఎఫ్ స్వర్ణోత్సవం శనివారం ఘనంగా జరిగాయి. స్థానిక సంత మార్కెట్లో యూటీఎఫ్ జెండాను జిల్లా ప్రధాన కార్యదర్శి నవీన్ పాటి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల కోసం యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఎన్నో పోరాటాలు చేసి సమస్యలను పరిష్కరించామన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతూ ఉంటామని అన్నారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు నీలకంఠ, రామచంద్ర, తాజుద్దీన్ ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారి నాగరాజు పాల్గొన్నారు.

జీవితాల్లో వెలుగు నింపేదే అవయవదానం

కర్నూలు డీఎస్పీ బాబుప్రసాద్


పోస్టర్లు విడుదల చేస్తున్న కర్నూలు డీఎస్పీ, తదితరులు

కర్నూలు(కల్చరల్), ఆగస్టు 10: ఇతరుల జీవితాల్లో వెలుగు నింపేదే అవయవ దానమని కర్నూలు డీఎస్పీ బాబు ప్రసాద్ అన్నారు. శనివారం లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు మెల్విన్ జోన్స్ ఆధ్వర్యంలో, ఆ క్లబ్ ప్రతినిధి డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన వాల్ పోస్టర్లు విడుదల చేశారు. ఈ నెల 13న అంతర్జాతీయ అవయవ దాన దినోత్సవం సందర్భంగా డీఎస్పీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో బాబు ప్రసాద్ మాట్లాడారు. ప్రతి ఒక్కరూ అవయవ దానానికి ముందుకు రావాలని అన్నారు. హోంగార్డ్స్ కమాండెంట్ మహేష్‌కుమార్ మాట్లాడుతూ అన్నదానం సాటి మనిషి కడుపు నింపితే, అవయవ దానం తోటి మనిషి ప్రాణాలు నిలబెడుతుందని అన్నారు. ఎపీఎస్పీ బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ మహబూబ్ బాషా మాట్లాడుతూ అన్ని దానాల్లోకెల్లా అవయవ దానం గొప్పదని, ప్రజల్లో అవగాహన పెరగాలని అన్నారు. లయన్స్ క్లబ్ ప్రతినిధి డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ మరణించాక కూడా జీవించే అవకాశం ఒక్క అవయవ దానం వల్లే కలుగుతుందని అన్నారు. మూడో పట్టణ సీఐ మురళీధర్ మాట్లాడుతూ మరొకరి ప్రాణాలు కాపాడే దాతృత్వ చర్యగా అవయవ దానాన్ని ప్రోత్సహించాలని అన్నారు. కార్యక్రమంలో వైద్య నిపుణులు డాక్టర్ జయప్రకాశ్, డాక్టర్ ప్రభాకర్, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ప్రతినిధులు క్రిష్టఫర్, మాధవనాయుడు, శేఖర్, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించాలి


క్రీడాకారులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న డాక్టర్ శంకర్‌శర్మ

కర్నూలు(స్పోర్ట్స్), ఆగస్టు 10: క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించాలని సీనియర్ గ్యాస్ట్రోఎంట్రాలజిస్టు డా.శంకర్‌శర్మ అన్నారు. శనివారం స్థానిక చిన్మయ విద్యామిషన్‌లో జరిగిన కార్యక్ర మంలో కేరళ, విశాఖపట్నంలో జరిగిన కరాటే సెమినార్‌లో పాల్గొన్న క్రీడాకా రులకు సర్టిఫికెట్లు, మెడల్స్‌ను ఆయన పంపిణీ చేశారు. అలాగే భూటాన్‌లో జరిగిన ఏసియా పసిఫిక్ సెమినార్‌లో జడ్జీగా పాల్గొన్న జగదీష్‌కు ప్రశంసాపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శంకర్‌శర్మ మాట్లాడుతూ క్రీడాకారులు కరాటే పోటీల్లో ప్రతిభ కనబరచడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కరాటే మాస్టర్లు ఆరీఫ్, జగదీష్, ఫయాజ్ పాల్గొన్నారు.

రచయిత పల్లేటి లక్ష్మీ కులశేఖర్ కన్నుమూత



కర్నూలు(కల్చరల్), ఆగస్టు 10: సినీ, టీవీ నాటక రచయిత పల్లేటి లక్ష్మీ కులశేఖర్ శుక్రవారం రాత్రి కన్నుమూశారు. అనారోగ్యంతో బాధపడుతూ ఉన్న ఆయన శుక్రవారం అర్థరాత్రి గుండె పోటు రావడంతో కడప నగరంలోని స్వగృహంలో తుదిశ్వాస విడిచారు. రచయిత పల్లేటికి కర్నూలు జిల్లాతో ఎంతో అనుబంధం ఉంది. ఆయన టీజీవీ కళాక్షేత్రం ఆస్థాన రచయితగా కొనసాగుతున్నారు. తెలుగు సాహిత్యంలో 62 పద్య నాటకాలు, 40 సాంఘిక నాటకాలు రాసిన ఘనత ఆయనకే సొంతం. ఆయన మృతికి టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, కళాకారులు బాల వెంకటేశ్వర్లు, సంగా ఆంజనేయులు, రాజారత్నం, జీవీ శ్రీనివాసరెడ్డి, మహ్మద్‌మియా, శామ్యూల్‌లు తమ సంతాపం ప్రకటించారు. ఆదివారం సాయం త్రం 6 గంటలకు పల్లేటి లక్ష్మీ కులశేఖర్ సంతాప సభను టీజీవీ కళా క్షేత్రంలో ఏర్పాటు చేసినట్లు పత్తి ఓబులయ్య తెలిపారు.

కిడ్నాప్ కేసులో మరో ఇద్దరి అరెస్టు

కోడుమూరు, ఆగస్టు 10: గూడూరు పట్టణానికి చెందిన బంగారు వ్యాపారి డమామ్ వెంకటేశ్వర్లు కిడ్నాప్ కేసులో మరో ఇద్దరిని అరెస్టు చేసినట్లు కోడుమూరు సీఐ మన్సూరుద్దీన్ చెప్పారు. స్థానిక సర్కిల్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సీఐ వివరాలను వెల్లడించారు. గత నెల 29న బంగారు వ్యాపారి డమాం వెంకటేశ్వర్లును ముగ్గురు వ్యక్తులు కిడ్నాప్ చేశారు. ఎస్పీ బిందుమాధవ్ ఆదేశాల మేరకు ఎమ్మిగనూరు, గోనెగండ్ల, కోడుమూరు, కర్నూలు నాల్గవ పట్టణ సీఐలు అలాగే కోడుమూరు, గూడూరు, నాగలాపురం ఎస్ఐలు కలిసి బృందాలుగా ఏర్పడి నిందితుల కోసం గాలించారు. అదే రోజు కిడ్నాపర్ల నుంచి డమామ్ వెంకటేశ్వర్లును విడిపించి ఇద్దరు నిందితులను అరెస్టు చేసి కిడ్నాప్‌కు ఉపయోగించిన స్కార్పియోను స్వాధీనం చేసుకున్నారు. కిడ్నాప్‌కు ప్రధాన సూత్రధారి అయిన పులకుర్తి గ్రామానికి చెందిన గొల్ల వీరేష్, అలాగే స్కార్పియోకు నంబర్ ప్లేట్ మార్చి ఇచ్చి కిడ్నాప్‌కు సహకరించిన వాహనం యజమాని కర్నూలు చెందిన మహబూబ్‌బాషాను శనివారం అరెస్టు చేశారు. నిందితులు పారిపోవడానికి సహకరించిన మరో ఇద్దరి కోసం గాలిస్తున్నారు. కార్యక్రమంలో కోడుమూరు, గూడూరు ఎస్ఐలు బాలనరసింహులు, హనుమంతయ్య పాల్గొన్నారు.

పోలీసులకు నగదు ప్రోత్సాహం అందజేత :

కిడ్నాప్ కేసులు చేధించిన పోలీసులకు ఎస్పీ బిందుమాధవ్ నగదు ప్రోత్సాహంతో అభినందించారు. ఈ సందర్భంగా నగదును కోడుమూరు సీఐ మన్సూరుద్దీన్ చేతుల మీదుగా పురస్కారం అందించారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయండి


ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబును కలిసిన విద్యా కమిటీ చైర్మన్లు

మద్దికెర, ఆగస్టు 10: మండలంలో పార్టీలకతీతంగా ఎన్నికైన విద్యాకమిటీ చైర్మన్లు పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు సూచించారు. శనివారం మండలంలోని హంపా గ్రామంలో విద్యాకమిటీ చైర్మన్లుగా ఎంపికైన వారు ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబును కలిశారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికైన సభ్యులు పాఠశాలకు వెళ్లి డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించాలన్నారు. కార్యక్రమంలో విద్యాకమిటి చైర్మన్ తలారి రాజ్‌కుమార్, టీడీపీ నాయకులు మహ్మద్ రఫీ, జాకీర్ హుశేన్, అల్లీసాబ్, చంద్ర, సుభాన్, కాశీం, రఫీ ఉన్నారు.

ఘనంగా గంజహళ్లి బడేసాహెబ్ పెద్ద ఉరుసు


గంధం తీసుకెళ్తున్న పీఠాధిపతులు

గోనెగండ్ల, ఆగస్టు 10: గంజహళ్ల బడేసాహెబ్ పెద్ద ఉరుసు మహోత్సం శనివారం అంగరంగ వైభవంగా జరిగింది. తెల్లవారుజామున స్వామి వారి వారసులు గంధాన్ని తీసుకొని స్వామి వారి జీవసమాధి వద్దకు వచ్చి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పీఠాధిపతులు మాట్లాడుతూ శ్రావణ మాసంలో పంచమి తిథి యందు గంజహళ్లి గ్రామంలో బడేసాహెబ్ స్వామి వారి 330 వ పెద్దఉరుసు మహోత్సవం నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. 11న జియారత్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఆటో డ్రైవర్లు నిబంధనలు పాటించాలి



ఆటో డ్రైవర్లతో మాట్లాడుతున్న సీఐ

ఎమ్మిగనూరు టౌన్, ఆగస్టు 10 : ఆటో డ్రైవర్లు నిబంధనలు పాటించాలని సీఐ సుదర్శన్ రెడ్డి అన్నారు. శనివారం ఎమ్మిగనూరులోని స్థానిక పట్టణ పోలీస్ స్టేషన్‌లో శనివారం ఆటో డ్రైవర్లతో సమావేశం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ మాట్లాడుతూ పట్టణంలో ఆటోలు రోడ్డుపై ఆపకుండా, స్టాండ్స్‌లోనే పెట్టుకోవాలని, ప్రధాన సర్కిల్‌లలో ప్రయాణికులను కోసం రోడ్లపై నిలపకుండా ప్రక్కకు ఆపుకోవాలని సూచించారు. ప్రయాణికులతో మర్యాదపూర్వకంగా మెలగాలని, రాత్రి వేళలో ఆటో నడిపే వారు ఏదైనా నేర సంఘటనలు చూసిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

పాఠశాలల అభివృద్ధి కోసం పని చేయాలి


విద్యా కమిటీ చైర్మన్లను సన్మానిస్తున్న ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు

తుగ్గలి, ఆగస్టు 10: విద్యా కమిటీ చైర్మన్లు పాఠశాలల అభివృద్ధి కోసం పని చేయాలని మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ బత్తిన వెంకట్రాముడు అన్నారు. శనివారం పత్తికొండలో ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబును విద్యాకమిటీ చైర్మన్లు సన్మానించారు. వారు మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందే లా చర్యలు చేపడుతామని తెలిపారు. కార్యక్రమంలో చైర్మన్ వెంకటేశ్వర్లు, తలారి రాముడు, జిన్నామాబు, మోహన్, దేవేంద్ర, వైస్ చైర్మన్ సుధాకర్ తదితరులు ఉన్నారు.

బుద్ధదేవ్ భట్టాచార్యకు నివాళి

ఎమ్మిగనూరు, ఆగస్టు 10: పశ్చిమబెంగాల్ మాజీ ముఖ్యమంత్రి బుద్ధదేవ్ భట్టాచార్యకు సుందరయ్య భవన్‌లో శనివారం ఘనంగా నివాళి అర్పించారు. శనివారం ఎమ్మిగనూరు పట్టణ సీపీఎం కమిటీ ఆధ్వర్యంలో సంతాప సభను నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా ఉపాధ్యక్షులు రామాంజనేయులు, సీఐటీయూ నాయకులు గోవిందు, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షులు దేవసహాయం, రాముడు, యల్లప్ప, బాబు, నాగరాజు, ఆంథోని, సురేష్, అబ్దుల్లా, కృష్ణ, తిమ్మన్న, నాగరాజులు పాల్గొన్నారు.

ఆలూరు అభివృద్ధిపై దృష్టి సారించాలి

● నారా లోకేశ్‌ను కలిసిన వైకుంఠం శివప్రసాద్, జ్యోతి


నారలోకేశ్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి వైకుంఠం శివప్రసాద్, జ్యోతి

ఆలూరు, ఆగస్టు 10: మంత్రి నారా లోకేశ్‌ను శనివారం రాత్రి హైదారాబాద్‌లోని ఆయన నివాసంలో టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి వైకుంఠం శివప్రసాద్, మహిళ నాయకురాలు వైకుంఠం జ్యోతి కలిశారు. వెనుకబడిన నియోజకవర్గంలో పెం డింగ్‌లో ఉన్న వేదవతి, నగరడోణ ప్రాజెక్టులు పూర్తి చేసేందుకు నిధులు కేటాయించాలన్నారు. అలాగే హంద్రీనీవా తూము ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలన్నారు. జింకల బారిన పడి పంటలు నాశనం అవుతున్నాయని, జింకల పట్టివేతకు ఆపరేషన్ బ్లాక్ బగ్‌ను పునరుద్ధరించాలని కోరారు. అలాగే కేజీబీవీ, మోడల్ స్కూల్స్, హాస్టల్స్‌లో సీట్లు పెంచి విద్యార్థులకు వసతులు కల్పించాలని కోరగా మంత్రి సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు. వారివెంట మైనారిటీ నాయకులు రహమాన్ ఉన్నారు.

అన్నా క్యాంటీన్ పేరును ఉర్దూ భాషలో కూడా ఉండేలా చూడాలి



మంత్రి ఫరూక్‌కు వినతి పత్రం ఇస్తున్న కేఎండీ అల్తాఫ్ హుస్సేన్

ఆదోని ఆగస్టు 10: అన్నా క్యాంటీన్ల పేరును తెలుగుతోపాటు ఉర్దూ భాషలో కూడా ఉండేటట్టు చూడాలని రాష్ట్ర మైనారిటీ సెల్ ఉపాధ్యక్షుడు కేఎండీ అల్తాఫ్ హుస్సేన్, కర్నూల్ పార్లమెంట్ మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి డీఎండీ ఆరిఫ్ బాషా, మన్సూర్ అహ్మద్ కోరారు. శనివారం మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. వారు మాట్లాడుతూ, రాష్ట్రంలో మైనారిటీల అభివృద్ధి కోసం చేపట్టాల్సిన అంశాలపై వినతి ప్రతం అందజేవారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

ఆస్పరి, ఆగస్టు 10: మండలంలోని బెల్లేకల్ గ్రామంలో వైసీపీ ఉప సర్పంచ్ మల్లయ్య (49) అనే వ్యక్తి విద్యుదాఘాతంతో శనివారం మృతి చెందాడు. తన పత్తి పంట పొలంలో గుంటక పాస్తుండగా విద్యుత్ స్తంభం ఎర్తింగ్ వైరు తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య జయమ్మ, ఒక కుమారుడు, ఒక కూతురు ఉన్నారు. కుమారుడు అనిల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ రామంజినేయులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని తెలిపారు.

దొంగల అరెస్టు

హాలహర్వి, ఆగస్టు 10: ద్విచక్ర వాహనాల అపహరించుకుపోయే దొంగలను అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేంద్ర తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనాలను చోరీ చేసి తప్పించుకుని తిరుగుతున్న నిందితులను పట్టుకుని అరెస్టు చేసి కేసునమోదు చేశామని అన్నారు. వారి వద్ద ఉన్న 13 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని నిందితులను రిమాండ్‌కు తరలించామని వెల్లడించారు.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టండి

- అధికారుల సమీక్షా సమావేశంలో ఆర్డీవో రామలక్ష్మి


మాట్లాడుతున్న ఆర్డీవో రామలక్ష్మి

పత్తికొండ, ఆగస్టు 10: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అన్ని శాఖల అధికారులు సత్వర చర్యలు చేపట్టాలని ఆర్డీవో రామలక్ష్మి అన్నారు. పత్తికొండ కార్యాలయంలో 9 మండలాల అధికారులతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. ముఖ్యంగా ప్రజలకు సరఫరా చేసే తాగునీటి విషయంలో పూర్తి స్థాయి జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నీటివనరులు, పైప్‌లైన్, ఫిల్టర్‌బెడ్, క్లోరినేషన్‌ను అధికారులు ఒకటికిరెండుసార్లు పరిశీలించాలన్నారు. నీటి పంపిణీకి సంబంధించిన సమస్యలు, ప్రతిపాదనలు అందించాలని సూచించారు. మండలాల్లో తహసీల్దార్‌లు ఎంపీడీవోలు కలసి పనిచేయాలని నీటిద్వారా వచ్చే సీజనల్‌వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వీఆర్‌వోలు, వీఆర్‌ఏలు, మహిళా పోలీసులు గ్రామంలో జరుగుతున్న బాల్యవివాహాలపై పోలీసులకు ముందస్తు సమాచారం అందించాలన్నారు. ప్రతి గురువారం అంగన్‌వాడీ కేంద్రాలను, పాఠశాలలను మహిళా పోలీసులు తనిఖీ చేసి తహసీల్దార్‌లకు నివేదిక సమరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. 100 రోజల కార్యాచరణలో భాగంగా తహసీల్దార్‌లు రికార్డురూంల భద్రత, సీసీకెమెరాల ఏర్పాటు, అన్ని కార్యాలయాలకు వాచ్‌మెన్‌ల ఏర్పాటు చేసుకోవాలన్నారు. పీడీఎస్ బియ్యం 100 శాతం పంపిణీ అయ్యేలా చర్యలు చేపట్టాన్నారు. ఆయాశాఖల అధికారులు పాల్గొన్నారు.

తాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయండి

● వేదవతి ప్రాజెక్టును పూర్తి చేసి నియోజకవర్గ ప్రజలకు తాగు, సాగు నీరు అందించాలి


ఆస్పరిలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి గిడ్డయ్య

ఆస్పరి, ఆగస్టు 10: పెండింగ్‌లో ఉన్న తాగునీటి ప్రాజెక్టులను పూర్తిచేయాలని సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి గిడ్డయ్య అన్నారు. శనివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో భారత కమ్యూనిస్టు పార్టీ సీపీఐ మండల సమితి సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి రావడం జరిగిందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పేరుతో సంక్షేమ పథకాలను అమలు చేస్తామని మహిళలకు సంవత్సరానికి రూ.18000, అమ్మకు వందనం పేరుతో రూ.15000, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం చేస్తామన్నారు. రైతులకు పెట్టుబడి సాయం రూ.20వేల ఇస్తామన్న హామీలను అమలు చేయాలన్నారు. జిల్లాలోని పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టును తక్షణమే పూర్తి చేసి ప్రజలకు తాగునీరు, సాగునీరు అందించాలన్నారు. రాబోయే రోజుల్లో ఉద్యమాలకు పార్టీ శాఖ కార్యదర్శులు ప్రజాసంఘాల నాయకులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి విరుపాక్షి, కృష్ణమూర్తి, పార్టీ సీనియర్ నాయకులు ఆంజనేయ, బ్రహ్మయ్య, ఉరుకుందప్ప, సీపీఐ గ్రామశాఖ కార్యదర్శి రంగన్న, హనుమంతు, చంద్ర, గిడ్డయ్య, నరసన్న, రామాంజినేయ, కృష్ణ, మల్లన్న, గోపాల్, రంగన్న, సుంకన్న, ఈశ్వర్, రమేష్, హనుమంతు పాల్గొన్నారు.

ఆదోనిలో సంబరాలు


మాట్లాడుతున్న నరసయ్య

ఆదోని (అగ్రికల్చర్), ఆగస్టు 10: భారత హాకీ జట్టు పారిస్ విశ్వ క్రీడల్లో వరుసగా రెండో సారి కాంస్య పథకాన్ని సాధించడంపై వ్యాయామ ఉపాధ్యాయులు సంబరాలు చేసుకున్నారు. మున్సిపల్ క్రీడా మైదానంలోని హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ విగ్రహానికి ఆదోని జోన్ వ్యాయామ ఉపాధ్యాయ సంఘం నాయకులు పూలమాల వేసి స్వీట్లు పంచుకున్నారు. కార్యక్రమంలో ఆదోని జోన్ వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు నరసయ్య, ఖలీల్ అహ్మద్, నరసింహులు వ్యాయామ ఉపాధ్యాయులు రామన్న, ఓబన్న, ఈరన్న, రాము, రమేష్, రవి, బాలు, నరసింహరాజులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

కౌతాళం, ఆగస్టు 10: రోజు రోజుకు సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయని వాటి పట్ల ప్రజలు చాల అప్రమత్తంగా ఉండాలని కోసిగి సీఐ మంజునాథ తెలిపారు. కౌతాళంలో శనివారం అంబేడ్కర్ కూడలిలో సైబర్ నేరాలు, ర్యాష్ డ్రైవింగ్‌లపై ప్రజలకు అవగాహన కార్యక్రమం చేపట్టారు. సీఐ మాట్లాడుతూ ప్రజలు తమ సెల్‌ఫోన్‌లకు మేము బ్యాంకు అధికారులమని, మీ సెల్ బ్లాక్ అయిందని, మీ సెల్‌ఫోన్లకు ఓటీపీని పంపిస్తూ వాటిని చెప్పాలని, మోసాలకు పాల్పడుతున్నారని అలాంటి వాటిని నమ్మవద్దని సూచించారు. అలాగే మితిమీరిన వేగంతో వాహనాలను నడుపుతూ ప్రాణాలు కోల్పోతున్నారని, తప్పక ట్రాఫిక్ రూల్స్ పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ నరేంద్రకుమార్ రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ సోమ్లానాయక్, కానిస్టేబుళ్లు నారాయణ, రంగన్న ఉన్నారు.

రణమండల క్షేత్రానికి పోటెత్తిన భక్తులు


క్యూలైన్‌లో భక్తులు

ఆదోని (అగ్రికల్చర్) ఆగస్టు 10: పట్టణ శివారు ప్రాంతంలోని కొండల్లో వెలిసిన రణమండల అంజనేయుడికి భక్తులు పోటెత్తారు. శ్రావణ మాసం మొదటి శనివారం కావడంతో ఆంజనేయ స్వాముల వారిని దర్శించుకునేందుకు తెల్లవారు నుంచి భక్తులు క్యూ కట్టారు. ఆదోని డివిజన్ నుంచేగాక కర్ణాటక, తెలంగాణ, మహారాష్ట్ర నుంచి భక్తులు భారీగా తరలి వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఉదయం స్వామి వారికి సింధూర సేవ, పంచామృతాభిషేకం, ఆకు పూజ, తులసి హారం, వడల హారం వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. 41 రోజులపాటు మాలధారణ స్వాములుతోపాటు ఆంజనేయ భక్తులు కొండపై కాలినడకన ఉదయం నుంచే ప్రతిరోజూ వెళ్లి దర్శించుకొని పూజలు చేస్తారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేకమైన ఏర్పాట్లు చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదాన సౌకర్యం కల్పించారు.

ఆలూరు రూరల్: ఆలూరు పట్టణంలోని అరికేర రహదారిలో వెలసిన అభయ ఆంజనేయ స్వామికి శ్రావణ మాసం మొదటి శనివారం పూజలు చేశారు. ఉదయం రుద్రభిశేకం, ఆకుపూజ, కుంకుమ అర్చన, పంచామృతశేకం, మహా మంగళ హారతి వంటి విశేష పూజలను అర్చకులు నీలప్ప చేశారు. అలాగే ఆలూరుకు సమీపంలో వెలసిన బెళ్ళిగుండు ఆంజనేయ స్వామి దేవాలయంలో పూజలు చేశారు.

దేవనకొండ : దేవనకొండ బీసీ కాలనీలో నూతనంగా నిర్మించిన ఆంజనేయస్వామి దేవాలయంలో ఆలూరు ఎమ్మెల్యే బూసినే విరూపాక్షి పూజలు చేశారు. శనివారం విరూపాక్షి ఆలయాన్ని సందర్శించి పూజలు నిర్వహించారు. వైసీపీ మండల కన్వీనర్ శ్రీనివాసులు నాయుడు, జడ్పీటీసీ సభ్యులు రామకృష్ణ, శ్రీరాములు, తెర్నేకల్ సర్పంచు అరుణ్‌కుమర్ ఉన్నారు.

మద్దికెర: మండలంలో శ్రీరంగనాథ స్వామి దేవాలయంలో తొలి శ్రావణ శనివారం పూజా కార్యక్రమాలనునిర్వహించారు. శనివారం ఆలయ ప్రధాన అర్చకులు రంగస్వామి ఆధ్వర్యంలో రంగనాథ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. భూదేవి శ్రీదేవి సతీసమేత శ్రీరంగనాథస్వామి ఉత్సవ మూర్తులను పల్లకిలో ఊరేగింపు చేశారు.

రూ.3.16 కోట్లతో గురు నివాస్ భవనం పనులు పూర్తి

● 15న ప్రారంభానికి సన్నాహాలు



మంత్రాలయం, ఆగస్టు 10: మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠం తుంగభద్ర నది వెనుక భాగాన తులసి వనం సమీపంలో రూ.3.16 కోట్లతో నిర్మించిన గురు నివాస్ భవన నిర్మాణం పనులు పూర్తయ్యాయి. బెంగుళూరు చెందిన అశ్వథ నారాయణ అను భక్తుడు రూ.3.16 కోట్లతో సొంతంగా నిర్మించి శ్రీమఠానికి అప్పగించనున్నారు. ఈ నెల 15న మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు, దాతలు అశ్వథామలు ప్రారంభించనున్నారు. కాంట్రాక్టరు ఓబులయ్య, సైట్ ఇంజనీర్ శ్రీనివాసులు త్వరితగతిన పనులు పూర్తి చేసినందుకు మఠం అధికారులు అభినందించారు.

వాల్మీకి బోయ సంఘం మండల కార్యదర్శిగా హులేబీడు వీరేశ

ఆలూరు రూరల్, ఆగస్టు 10: ఆంధ్రప్రదేశ్ వాల్మీకి బోయ సంఘం ఆలూరు మండల ప్రధాన కార్యదర్శి హులేబీడు బోయ వీరేశ్‌ను నియమించారు. శనివారం బోయ వీరేష్ మాట్లాడుతూ వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు. వాల్మీకులు విద్య, ఆర్థిక, రాజకీయంగా చైతన్యం కావాల్సిన అవసరం ఉందన్నారు. తనకు వాల్మీకి బోయ సంఘం మండల ప్రధాన కార్యదర్శిగా అవకాశం కల్పించిన జిల్లా అధ్యక్షుడు వాల్మీకి అర్జున్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యా కమిటీ చైర్మన్లకు సన్మానం


విద్యా కమిటీ చైర్మన్లను సన్మానిస్తున్న నాయకులు

పత్తికొండ టౌన్, ఆగస్టు 10: పత్తికొండ పట్టణంలో శనివారం పలు పాఠశాలల్లో నూతనంగా ఎన్నికైన సీపీఐ నూతన విద్యాకమిటీ చైర్మన్లను ఘనంగా సత్కరించారు. స్థానిక సీఆర్ భవన్‌లో ఉర్దూ పాఠశాలకు ఎన్నికైన ఫకృద్దీన్ ఖాన్, పట్టణంలోని మండ్రోపేట స్కూల్‌కు ఎన్నికైన నెట్టికంటయ్యను, బొందిమడుగుల గ్రామ పాఠశాలకు ఎన్నికైన షేక్షావలి, సెంట్రల్ స్కూల్ వైస్ చైర్మన్‌గా ఎన్నికైన రామాంజులును సీపీఐ మాజీ జిల్లా కార్యదర్శి భీమలింగప్ప ఆధ్వర్యంలో ఘనంగా శాలువ, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి నబీరసూల్, రైతు సంఘం నాయకులు కారన్న, వ్యవసాయ కార్మికసంఘం నాయకులు వెంకట్రామిరెడ్డి, ప్రజానాట్య మండలి నాయకులు వెంకట్రాముడు, సీపీఐ నాయకులు గిడ్డయ్యగౌడు పాల్గొన్నారు.

కూటమితోనే ఎస్సీ వర్గీకరణ సాధ్యం

ఆలూరు, ఆగస్టు 10: ఎస్సీ వర్గీకరణ పోరాటం 30 ఏళ్ల నిరీక్షణ అని మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా కార్యదర్శి ముత్యాల గాదిలింగ అన్నారు. శనివారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఈనెల 13న హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న విజయ దండోరా కార్యక్రమానికి అన్ని గ్రామాల నుంచి పెద్ద ఎత్తున మాదిగ వర్గానికి చెందిన ఉద్యోగులు, విద్యార్థులు, ఎమ్మార్పీఎస్ నాయకులు పార్టీలకు అతీతంగా మందకృష్ణ మాదిగ ఢిల్లీ కోట మీద ఎగరవేసి హైదరాబాద్ గడ్డపై అడుగు పెడుతున్నాడన్నారు.

అవినీతికి పాల్పడిన వారిని వదిలిపెట్టం

ఆదోని, ఆగస్టు 10: వైసీపీ పాలనలో అవినీతికి పాల్పడిన వారిని వదిలిపెట్టమని ఐ టీడీపీ అధ్యక్షుడు విరుపాక్షి అన్నారు. శనివారం ఆయన మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వంలో అవినీతి అక్రమాలు, దౌర్జన్యాలు, దాడులు చేశారని, నేడు కూటమి పార్టీలో చేరి రక్షణ పొందాలని చూస్తున్నారని అలాంటి వారి పట్ల కూటమి నాయకులు కూడా జాగ్రత్తలు పడాల్సిన అవసరం ఉందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడేందుకు కృషి చేసిన కార్యకర్తలకు న్యాయం చేయాలని ఆయన కోరారు.

బీజేపీలో చేరిన వైసీపీ కార్యకర్తలు


పార్టీలో చేరిన నారాయణపురం గ్రామస్తులు

ఆదోని టౌన్, ఆగస్టు 10: నారాయణపురం గ్రామంలో వైసీపీకి చెందిన 40 కుటుంబాలు బీజేపీ చేరాయి. శనివారం ఆదోని ఎమ్మెల్యే డా. పార్థసారథి సమక్షంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు కునిగిరి నీలకంఠ ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు కురువ వేణుగోపాల్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేంద్ర కుమార్, అసెంబ్లీ కో కన్వీనర్ నాగరాజు గౌడ్, ఎస్‌సీ మోర్చా ఉపాధ్యక్షుడు రమకృష్ణ, మండల ఉపాధ్యక్షుడు రంగనాథ్ రెడ్డి, నరిసంహులు పాల్గొన్నారు.

ఆటోను ఢీకొన్న మరో ఆటో

ఆదోని, ఆగస్టు 10: ఆదోని పట్టణంలోని కొత్త బ్రిడ్జి సమీపంలో నిల్చున్న ఆటోను వెనక నుంచి మరో ఆటో ఢీ కొంది. దీంతో మదిరే గ్రామానికి చెందిన 60 ఏళ్ల చంద్రన్నకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు చికిత్స నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఆటో డ్రైవర్ వేగంతో నడపడం వల్లే ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రైతులకు రాయితీ విత్తనాలు ఇవ్వాలి

మద్దికెర, ఆగస్టు 10: మండలంలో రైతులకు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకునేందుకు ప్రత్యామ్నాయ విత్తనాలు అందజేయాలని మండల సీపీఐ కార్యదర్శి నాగరాజు, మండల సహాయ కార్యదర్శి మదనంతపురం హనుమన్న కోరారు. శనివారం వారు మాట్లాడుతూ ఈ ఏడాది ఆలస్యంగా వర్షాలు పడటం వల్ల రైతులు వేరుశనగ పంట సాగు చేయలేదని, అందువల్ల విత్తన సాగుకు సమయం లేదని రైతులకు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకునేందుకు విత్తనాలు అందజేస్తేసాగు చేస్తారని తెలిపారు. అలాగే రైతులకు అందుబాటులో ఎరువులు అందుబాటులో ఉంచాలన్నారు. ఈ సమావేశంలో సీపీఐ నాయకులు ఉన్నారు.

రాష్ట్ర అభివృద్ధే సీఎం ధ్యేయం

మద్దికెర, ఆగస్టు 10: ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేసినప్పటి నుంచి రాష్ట్ర అభివృద్ధి, ప్రజల అభ్యున్నతే ధ్యేయంగా పని చేస్తున్నారని ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు అన్నారు. శనివారం మద్దికెర గ్రామంలోని టీడీపీ నాయకులు ఎన్.లక్ష్మీనారాయణ స్వగృహంలో విలేకరులతో మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ పాలనలో అభివృద్ధి శూన్యమని అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడ్డారన్నారు. త్వరలోనే అన్నక్యాంటీన్లు ప్రారంభం కానున్నాయనీ, ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణాలు అమలు చేయడం జరుగుతుందన్నారు. ఎవరైనా అవినీతికి పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సభ్యులు జమేదార్ రాజన్న యాదవ్, టీడీపీ నాయకులు ఎన్.చంద్రశేఖర్, ఉదయ్ కుమార్, తదితరులు ఉన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాల ఏర్పాటు


టీడీపీ నాయకులు, ఏఈ సమక్షంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను మార్చుతున్న విద్యుత్ సిబ్బంది

గోనెగండ్ల, ఆగస్టు 10: గోనెగండ్లలో లోవోల్టేజి సమస్య తీరిందని విద్యుత్ ఏఈ సుధాకర్ అన్నారు. గ్రామంలో లోవోల్టేజీ సమస్య ఉందని దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని టీడీపీ నాయకులు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన విద్యుత్ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. దీంతో శనివారం విద్యుత్ సిబ్బంది గోనెగండ్లలో రెండు చోట్ల 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌లకు బదులు 160కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో గ్రామ మేజర్ సర్పంచ్ హైమావతి, అడ్వకేట్ చంద్రశేఖర్, వెంకటేశ్వర్లు, మదీనా, బాబునాయుడు, శ్రీధర్, రామాంజినేయులు పాల్గొన్నారు.

నాటు సారా స్థావరాలపై దాడులు

పత్తికొండ టౌన్, ఆగస్టు 10: నియోజకవర్గ పరిధిలోని జూప్లాతాండల్లో పత్తికొండ సెబ్ పోలీసులు శనివారం నాటుసారా స్థావరాలపై విస్తృత దాడులు చేశారు. పత్తికొండ సెబ్ సీఐ స్వర్ణలత, ఎస్ఐ కార్తిక్ సాగర్‌లతో పాటు సిబ్బంది ఆయా తాండల్లో విస్తృత దాడులు చేశారు. అందులో 10 లీటర్ల నాటుసారా సీజ్ చేయడమే కాక.. 300 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసి సారాకు ఉపయోగించే 160 కేజీల బెల్లంను స్వాధీనం చేసుకుని సారా తయారీ చేస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు సెబ్ సీఐ స్వర్ణలత తెలిపారు. దాడుల్లో సెబ్ హెడ్ కానిస్టేబుల్ సర్దార్ హుశేన్, మాబుపీరా, కానిస్టేబుల్ వెంకటేశులు పాల్గొన్నారు.

పంట నమోదు తప్పనిసరి

తుగ్గలి, ఆగస్టు 10: ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంట నమోదు ఖచ్చితంగా చేయించుకోవాలని మండల ఇన్‌చార్జి వ్యవసాయాధికారి పవన్ కుమార్ అన్నారు. శనివారం తుగ్గలి, ఎద్దులదొడ్డి తదితర గ్రామాల్లో రైతులతో ఆయన మాట్లాడుతూ వచ్చే నెల 10వ తేదీలోపు ఈక్రాప్ నమోదు పూర్తి చేయాలని అలాగే ఈక్రాప్ నమోదు చేసుకోకపోతే ప్రభుత్వ పథకాలు అందవని, అలాగే సన్నావడ్డీ, పంట నష్టపరిహారం, రుణాలు, పంటల కొనుగోలు వంటివి చేయరన్నారు. ఖచ్చితంగా ఈక్రాప్ చేయించుకోవాలని రైతులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు లక్ష్మిచైతన్య పాల్గొన్నారు.

ప్రపంచ మాస్టర్ అథ్లెటిక్ పోటీలకు ఆదోని మాస్టర్ అథ్లెట్ బందే నవాజ్


బందే నవాజును సన్మానిస్తున్న మాస్టర్ అథ్లెటిక్ అసోసియేషన్ సభ్యులు

ఆదోని (అగ్రికల్చర్) ఆగస్టు 10: ఈనెల 13 నుంచి స్వీడన్‌లోని గోథెన్స్ బర్గ్‌లో జరిగే వరల్డ్ మాస్టర్ అథ్లెటిక్ పోటీలకు ఆదోని మాస్టర్ అథ్లెటిక్ క్రీడాకారుడు కాజా బందే నవాజ్ ఎంపికయ్యారు. శనివారం ఆయన క్రీడా పోటీలలో పాల్గొనేందుకు బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా ఆదోని మాస్టర్ పలువురు ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ నెల 13 నుంచి 25వ తేదీ వరకు పోటీలు జరగనున్నాయి. ఈ పోటీలలో 60 ఏళ్ల కేటగిరీలో ఖాజా బందే నవాజ్ పాల్గొంటారు. మాజీ ఎంపీ టీజీ వెంకటేష్, జిల్లా మాస్టర్ అథెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పాండురంగారెడ్డి, రవికుమార్ అభినందనలు తెలిపారు.

ఘనంగా యూటీఎఫ్ స్వర్ణోత్సవాలు



ఎమ్మిగనూరులో యూటీఎఫ్ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆదోని (అగ్రికల్చర్), ఆగస్టు 10: ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ సంఘం (యూటీఎఫ్) స్వర్ణోత్సవ వేడుకలను శనివారం ఉపాధ్యాయులు ఘనంగా జరుపుకున్నారు. స్థానిక మున్సిపల్ ఉన్నత పాఠశాలలో యూటీఎఫ్ సీనియర్ మహిళా నాయకురాలు వాణి కుమారి యూటీఎఫ్ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు విరుపాక్షి, పాపయ్య కృష్ణమూర్తి, కుమిదిని దేవివాని, కుమారి, ఫయాజ్, సునీల్, రాజ్ కుమార్, జిల్లా సహాయ అధ్యక్షురాలు జీవిత, కార్యదర్శి గాదిలింగప్ప, శ్రీనివాసులు, మల్లికార్జున, భోజరాజు, రుద్రముని, పెద్దయ్య, హుసేని, నారాయణ, రమణ, నాగేష్, ఋషికేష్; కళావతి, రేణుక భాయి, కళ్యాణి, నాగలక్ష్మి, తేజ, లింగన్న, నరసయ్య గౌడ్, అమరేష్ రంగన్న, భాస్కర్ పాల్గొన్నారు.

నందవరం: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం యూటీఎఫ్ నిరంతరం కృషి చేస్తుందని యూటీఎఫ్ సీనియర్ నాయకులు దేవసహాయం అన్నారు. శనివారం మండలంలోని ముగతి సర్కిల్‌లో 50వ స్వర్ణోత్సవ పతకాన్ని నాయకులు అబ్దుల్ రహిమాన్, ఆంజినేయులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు దావీదు, ఎల్లప్ప, దేవపాల్, నాగరాజు, శ్రీనివాపపులు, నరసింహులు, నాగరాజు, ఉసేని, వీరభద్రయ్య పాల్గొన్నారు.

పత్తికొండ: యూటీఎఫ్ 50వ ఆవిర్భావ దినోత్సవం కార్యక్రమాలు పత్తికొండలో ఉపాధ్యాయులు శనివారం ఘనంగా జరుపుకున్నారు. స్థానిక కార్యాలయం ఆవరణలో సీనియర్‌నాయకులు నర్సోజీరావు జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు భాస్కర్, ఈశ్వర్, వీరేష్, ప్రసాద్‌బాబు, రంజాన్, షరీఫ్, రంగస్వామి, సత్యనారాయణ, నాగభూషణంలతోపాటు ఉపాధ్యాయులు ఉన్నారు.

ఎమ్మిగనూరు టౌన్: ఎమ్మిగనూరు పట్టణంలోని స్థానిక కార్యాలయం నందు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు యన్.నాగమణి మరియు సోమప్ప సర్కిల్ నందు సీనియర్ నాయకులు బి జి మాదన్న పతాకాలను ఆవిష్కరించారు. జిల్లా గౌరవ అధ్యక్షుడు యస్.దావీదు,రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు జె.ఎల్లప్ప మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యలపైన, విద్యారంగ సమస్యలపై అలుపెరుగని పోరాటాలు చేస్తూ ఎన్నో విజయాలు యూటీఎఫ్ సాధించిందని పేర్కొన్నారు. అనంతరం స్వర్ణోత్సవ క్రీడా సంబరాలలో భాగంగా వీవర్స్ కాలనీ గ్రౌండ్‌లో క్రికెట్ మ్యాచులను డా మాలకొండయ్య ప్రారంభించారు. కార్యక్రమంలో శ్రీనివాసులు,దేవపాల్,కౌలన్న,యం రాజు,సుమలత,తులశమ్మ తదితరులు పాల్గొన్నారు.







నందవరం, పత్తికొండ, ఆదోనిలో యూటీఎఫ్ జెండాలను ఆవిష్కరిస్తున్న నాయకులు